


సోమశిలలో 31.757 టీఎంసీల నిల్వ

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 22 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలకుగాను 31.757 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2,400 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 250, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నారు.



బరిలో దిగుదాం..

ఊళ్లకు దూరంగా.. రోడ్లకు దగ్గరగా..

సంక్రాంతికి సై అంటున్న కోడిపుంజులు



పందెం కాద్దాం!

- డైమండ్ డబ్బా, లోపలా బయటా, తదితర జూదాలు షురూ
- ఎన్నికల ఏడాది కావడంతో నాయకుల అండ





కాయ్ రాజా... కోడి రాజా..! అంటూ కోడిపందేలు, డైమండ్ డబ్బా, లోపలాబయటా, అచ్చుబొమ్మ, సింగిల్ నెంబర్లాట అబ్బో ఇలా ఎన్నో రకాల పందేలు నిర్వహించేందుకు జూదగాళ్లు సిద్ధమవుతున్నారు. ఇందుకు అవసరమైన బరుల ఏర్పాటుకు ఊళ్లకు దగ్గరగా, రవాణాకు అనుకూల ప్రాంతాలను ఎంపిక చేసుకుంటున్నారు. సంక్రాంతికి నాలుగు రోజులు ముందే పందేలు ఆరంభించి పండుగ తర్వాత నాలుగు రోజులకు ముగించేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరలో ఎన్నికలు జరగనున్న దృష్ట్యా రాజకీయ నాయకులు పూర్తిస్థాయిలో అండగా నిలిచేందుకు అంగీకరించారని సమాచారం. ఇంకేముంది.. పోలీసులు, సెబ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకుండా మౌఖిక ఆదేశాలు కూడా వెళ్లినట్టు తెలుస్తోంది.

నెల్లూరు (క్రైం), జనవరి 9 : సంక్రాంతి పండుగ అంటే చాలు పొరుగు జిల్లాలతోపాటు పలు రాష్ట్రాలకు చెందిన ఎంతోమంది జిల్లాకు వచ్చేందుకు ఉవ్విళ్లూరుతారు. ముందుగానే రిజర్వేషన్ చేసుకోవడమే లేదా అప్పటికప్పుడు వాహనాలను అద్దెకు మాట్లాడుకుని జిల్లాలో వాలిపోతారు. అలా వచ్చే వారంతా అత్తగారి ఇంటికో లేదా బంధువుల ఇంటికో అని అనుకుంటే మీరు పొరబడ్డట్టే. పెద్ద పండుగ సందర్భంగా జిల్లాలో జరిగే వివిధ రకాల పందేలు ఆడేందుకు పెద్ద సంఖ్యలో జూదగాళ్లు ప్రతి ఏడాది తరలి వస్తుంటారు. అయితే, ఈ ఏడాది మాత్రం ప్రతిసారిలా కాకుండా వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉండనుంది. ఎందుకంటారా!? త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనుండటంతో నాయకుల పూర్తి అండ నిర్వాహకులకు ఉండనుంది. ఇంకేం అడ్డూ అదుపు లేకుండా రాత్రింబవళ్లు జూదం నిర్వహించేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి.

● నాయకుల అండతో...

మరోవైపు పండుగ సీజనులో జరిగే జూదాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ సన్నద్ధమవుతుంది. పోలీసు స్టేషన్ల పరిధిలో ప్రజలతో అవగాహన సదస్సులు నిర్వహించి జూదాలు నిర్వహించినా, ఆడినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరికలు జారీ చేస్తుంటారు. కానీ ఆచరణలో ఇవేమీ ఉండటం లేదు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో జూదాలు జరుగుతున్నా పట్టీపట్టనట్టు వ్యవహరిస్తుంటారు. ఈసారి ఎన్నికల సంవత్సరం కావడంతో ఇప్పటికే పలువురు నాయకులను జూదం నిర్వాహకులు కలవడం, వారు కూడా సరేనంటూ అభయం ఇచ్చినట్టు సమాచారం. ఇంకేముంది.. సహజంగా ఒక బరిలో నిర్వహించే వారు ఈ ఏడాది రెండు, మూడు బరులను ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. బరులలో కోడి పందేలతో పాటు డైమండ్ డబ్బా, మూడుముక్కలాట, లోపలాబయట, ఇలా అనేక జూదాలను నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. పందేలా కాసేందుకు, చూసేందుకు వచ్చే వారి కోసం టిఫిన్ స్టాల్స్, కూల్‌డ్రింక్స్, భోజనాలు, బిర్యానీ, ఇలా అనేక దుకాణాలు సైతం ఏర్పాటు చేసి వాటిని వేలం పాట ద్వారా అందజేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం. నాయకులు పూర్తి స్థాయిలో అందరికీ హామీలు ఇవ్వడం, ఇప్పటికే పోలీసులకు పందేల జోలికి వెళ్లొద్దని చెప్పినట్లు సమాచారం.

● జాతికోళ్ల కొనుగోలు

పెందేల కోసమే అన్నట్టుగా ఇతర రాష్ట్రాల నుంచి పందెపురాయుళ్లు జాతి కోళ్లను కొనుగోలు చేసి గుట్టుచప్పుడు కాకుండా జిల్లాకు దిగుమతి చేస్తున్నారు. కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి డేగ, పొండుడేగ, పర్ల, నెమలి, బెరస ఇలా అనేక రకాల జాతి కోడిపుంజులను కొనుగోలు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలలో రూ.3 వేలకు కొనుగోలు చేసిన పుంజును జిల్లాలో శిక్షణ ఇచ్చి రూ.10 వేల నుంచి లక్ష వరకు విక్రయిస్తున్నారు. శిక్షణ సమయంలో బాదం, జీడిపప్పు, పిస్తా వంటి బలవర్థకమైన ఆహారం అందజేస్తుంటారు. నీటిలో ఈత, తాళ్లు కట్టి పరుగులు తీయించడం వంటి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. రాటుతేరిన కోళ్లను అధిక ఆదాయానికి అమ్మడం జిల్లాలో పలువురు వృత్తిగా మార్చుకున్నారు.



● ఇళ్లను అద్దెకు తీసుకుని..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో కోడి పందేలు ఆడేందుకు ప్రకాశం, కడప, కర్నూలు, తిరుపతి, చిత్తూరు జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఎంతో మంది వస్తుంటారు. ఈ క్రమంలో జిల్లాలో ఏయే ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారో ఇప్పటికే ఆరా తీస్తున్నారు. ఆ ప్రాంతాలకు దగ్గరగా ఉన్న పట్టణాలు, మండల కేంద్రాలలోని లాడ్జీలలో గదులను ముందుగానే రిజర్వు చేసుకుంటున్నారు. ఒకవేళ గదులు దొరకని పక్షంలో తెలిసినవారి ద్వారా ఇళ్లను బాడుగకు తీసుకుంటున్నారు. ఏది ఏమైనా ఈ సంక్రాంతికి రూ.లక్షలు గెలుచుకొని ఇళ్లకు పోవాలని కొందరు అప్పులు చేసి, ఆభరణాలు కుదవపెట్టి నగదు సిద్ధం చేసుకుంటున్నారు. మరోవైపు ఎలాగైనా విస్తృతంగా పందేలు నిర్వహించి ఆదాయం సమకూర్చుకోవాలని నిర్వాహకులు బరులను సిద్ధం చేస్తున్నారు.

● కావలిలో తమిళ పుంజులు

కావలి : డివిజన్‌లోని మారుమూల ప్రాంతాలైన అడవులు, సముద్ర తీరప్రాంతాలు, మన్నేరు లాంటి వాగు పరిసర ప్రాంతాలను జూదరులు కోడి పందేలకు స్థావరాలుగా సిద్ధం చేసుకుంటున్నారు. రూ.10వేల నుంచి 50వేలకు పుంజులను కొనుగోలు చేసి పందేనికి సిద్ధం చేస్తున్నారు. సిద్ధం చేస్తున్నారు. కొంతమంది తమిళనాడులోని శీలం నుంచి కోడిపుంజులను ఇక్కడకు దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నారు. తీర ప్రాంత గ్రామాలైన చెన్నాయపాలెం, అన్నగారిపాలెం, తాళ్లపాలెం, కోటడవి, ఇస్కపల్లి తదితర తీర ప్రాంతాలలో ఉన్న అడవులలో పందేలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇక అల్లూరు మండలంలో కోళ్ల పందేలు నిర్వహించే ముఠాలు 7 వరకు ఉన్నట్లు తెలుస్తోంది. దగదర్తి, కలిగిరి మండలం దూబగుంట, అన్నలూరు, కావలి మండలం కొత్తపల్లి, పెద్దారం, చలంచర్ల తదితర అటవీ ప్రాంతాలలో కూడా కోడి పందేలు జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. కొండాపురం మండలంలో పొట్టిపల్లి నుంచి వెల్లటూరువారి పాలెం వరకు మన్నేరు వాగు పరిసరాలలో పందేలు జోరుగా సాగే అవకాశాలు ఉన్నాయి. కొన్నిచోట్ల పోలీస్‌లతో ముందుగా మాట్లాడుకుని పందాలు వేసుకునేందుకు ఏర్పాట్లు చేసినట్లు సమాచారం.

● పట్టించుకునే వారేరీ!?

ఉదయగిరిరూరల్ : గ్రామాల్లో కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి. ప్రధానంగా వరికుంటపాడు మండలం జీ.కొండారెడ్డిపల్లి, కాంచెరువు, వేంపాడు, తిమ్మారెడ్డిపల్లి, తూర్పుబోయమడగల, ఉదయగిరి మండలం గుడినరవ, మల్లారెడ్డిపల్లి, మాసాయిపేట గ్రామాలతోపాటు సీతారామపురం, దుత్తలూరు మండలాల్లోనూ కోడి పందేలు జరుగుతున్నాయి. ఏటా నిర్వాహకులు జోరుగా పందేలను కొనసాగిస్తూ జేబులు నింపుకుంటున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యారు. స్థానికులతోపాటు ఇతర ప్రాంతాల్లో నివాసాలు ఉండే వలసవాసులు సైతం స్వగ్రామాలకు చేరుకోవడంతో పందేల నిర్వహణకు అడ్డూ ఆపూ లేకుండా పోయింది.

● ఆత్మకూరు, కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో కోడిపందేలు, పేకాట నిర్వహణకు ఏర్పాట్లు దాదాపు పూర్తయినట్టు సమాచారం. ముఖ్యంగా అటవీ ప్రాంతంలో ఎంపిక చేసుకున్న ప్రాంతాల్లో బరులు సిద్ధం చేసుకున్నారు. పందెపు రాయుళ్లకు, వీక్షకులకు ఎటువంటి లోటు రానీయకుండా నిర్వాహకులు ముందస్తు చర్యలు చేపట్టారు. అలాగే అక్కడ దుకాణాల ఏర్పాటుకు కూడా వేలం నిర్వహించినట్లు తెలుస్తోంది. సంక్రాంతి పండుగ మరో ఐదు రోజులు ఉండగానే గుట్టుచప్పుడు కాకుండా ఇప్పటికే పందేలు జరుగుతున్నాయి.



చల్ది కుండలతో తరలి వస్తున్న భక్తులు

దండాలు.. దండాలు.. అమ్మోరు తల్లో!

● అల్లూరులో వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల

అల్లూరులో పోలేరమ్మ తిరునాళ్ల మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం అమ్మవారికి అభిషేకంతో తిరునాళ్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు. అఖండ ప్రతిష్ఠ అనంతరం బంగారు ఆభరణాల అలంకరణలో అమ్మవారు దర్శనం ఇచ్చారు. మహిళలు చల్ది కుండలను తలపై పెట్టుకొని ప్రదర్శనగా ఆలయం వద్దకు చేరకుని ప్రదక్షిణలు అనంతరం పోతురాజుకు నైవేద్యంగా సమర్పించారు. కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి, ఆలయ చైర్మన్ మేడ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు వేడుకగా జరిగాయి. సాయంత్రం చలిపిండి పానకాలు, కుంభం కార్యక్రమంలో గ్రామస్థులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి సమర్పించారు. ఆచార సంప్రదాయం ప్రకారం కొమ్మలోళ్ల ద్వారా పోలేరమ్మ కథ, ముద్రగడ పావనం తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. వివిధ రకాల పూలు, విద్యుద్దీపాలతో ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. మంగళవాయిద్యాలు, ఆచారం తప్పెట్లతో కోలాటాలు, గంగపెట్టి, వీరతాళ్లు, ఆచార పలకలు, బొల్లి ఆవు, బసవదేవుడు, అరుంధీతీయుల కత్తి ఆచారం, రజకుల కాగడాల వెలుగులు, నాయీ బ్రాహ్మణ వాయిద్యాలు, సినీ గాయకుల పాట కచేరి భక్తులను ఆకట్టుకుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు, పోలీసులు విస్తృత ఏర్పాటు చేశారు.

- అల్లూరు



పోలేరమ్మ ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి

దర్జాగా కబ్జా!

- అంబాపురంలో రూ.2కోట్ల భూమి అన్యాక్రాంతం
- అంకణాల చొప్పున విక్రయించేందుకు ప్రయత్నాలు
- 'స్పందన'లో ఫిర్యాదు చేసిన స్థానికులు
- రాజకీయ ఒత్తిళ్లతో అడ్డుకోని అధికార యంత్రాంగం

ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు కబ్జాదారులు గద్దల్లా వాలిపోతున్నారు. ఆ భూమి ప్రజావసరాలకు ఉపయోగపడుతుందన్న ఆలోచన లేదు.. అధికారమే అండగా కాజేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇటువంటి వ్యవహారాలు అనేకం వెలుగు చూశాయి. తాజాగా నెల్లూరు నగర పరిధిలోని అంబాపురంలో కూడా 84 సెంట్ల ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేసి, విక్రయానికి సిద్ధమయ్యారు.

నెల్లూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : అంబాపురంలోని సర్వే నెం.96లో 84 సెంట్ల బండిదారి పోరంబోకు భూమి ఉంది. పూర్వం ఈ భూమి గ్రామస్థుల రాకపోకలకు ఉపయోగపడేది. ఇందులో కొంత రోడ్డు వేయగా మిగిలిన భూమి ఖాళీగా ఉంది. ఊరి మధ్యలో రోడ్డు పక్కనే ఉన్న ఈ భూమిపై కొందరి అక్రమార్కుల కన్ను పడింది. అందులో ఒకరు వైసీపీ నాయకుడు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. కొంత స్థలంలో నిర్మాణాలు చేపట్టగా, మిగిలిన భూమి చుట్టూ ఫెన్సింగ్ నాటారు. ఈ ఆక్రమణపై స్థానికులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంతో స్పందన పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేశారు. సర్వే చేసి ఆక్రమణలు తొలగిస్తామని గతేడాది సెప్టెంబరులో రూరల్ మండల రెవెన్యూ అధికారులు ఈ ఫిర్యాదుకు సమాధానం ఇచ్చారు. కానీ ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

● అంకణాల చొప్పున విక్రయం

ఇప్పుడు ఈ భూమిని అంకణాల చొప్పున విక్రయించేందుకు బేరం పెట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. అంకణం రూ.40 వేల నుంచి 50 వేల వరకు చెబుతున్నట్లు చెప్పుకుంటున్నారు. సుమారు రూ.2 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని అక్రమార్కులు అమ్మేందుకు ప్రయత్నాలు చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నగరం విస్తరిస్తున్న కొద్దీ ఈ ప్రాంతంలో అవసరాలు కూడా పెరుగుతున్నాయి. భవిష్యత్‌లో ఏదైనా పాఠశాల లేదా ఆసుపత్రి, కమ్యూనిటీ హాలో నిర్మించుకునేందుకు ఈ బండి దారి పోరంబోకు చాలా అనువుగా ఉంటుంది. అటువంటి భూమి పరుల పాలవుతున్నా రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

హద్దు రాళ్లు నాటుతాం

అంబాపురంలో ప్రభుత్వ భూమిలో ఉన్న ఆక్రమణలు తొలగిస్తాం. సర్వే చేసి ప్రభుత్వ భూమికి హద్దు రాళ్లు నాటుతాం. భవిష్యత్‌లో ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం.

- సోమ్లా నాయక్, నెల్లూరు రూరల్ తహసీల్దార్



అంబాపురంలోని బండిదారి పోరంబోకు భూమిలో వేసిన ఫెన్సింగ్



వీఆర్సీ కూడలిలో బైఠాయించిన ఆందోళనకారులు

మద్దతుగా నిలిచి.. పోలీసులను ప్రతిఘటించి

- వామపక్షాలు, ప్రజాసంఘాల ప్రదర్శన
- వీఆర్సీ కూడలిలో రాస్తారోకో.. అడ్డుకున్న పోలీసులు
- అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారించాలని డిమాండ్

నెల్లూరు (వైద్యం) జనవరి 9 : డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు మద్దతుగా ప్రజాసంఘాలు మంగళవారం నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించాయి. ఏబీఎం కాంపౌండ్ నుంచి వీఆర్సీ వరకు కొనసాగిన ప్రదర్శనలో వామపక్షాలతో పాటు సీపీఐ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వీఆర్సీ కూడలిలో రాస్తారోకో చేపట్టి, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మొండి వైఖరి విడనాడాలంటూ నినాదాలు చేశారు. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేసి వాహనాలలో ఎక్కిస్తుండగా కార్యకర్తలు ప్రతిఘటించి పోలీసు వాహనాలను కదలనీయకుండా అడ్డుగా కూర్చొన్నారు. దీంతో చేసేదిలేక నాయకులను విడిచిపెట్టారు. అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా వెళ్లి అంగన్‌వాడీల దీక్షకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీలపై ప్రభుత్వం కక్షసాధింపు ధోరణి మారాలన్నారు. వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, అజయ్‌కుమార్, మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెంచల నర్సయ్య, సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, అవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహా, రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరేంద్ర, హర్ష, రైతుసంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, మూలివెంగయ్య, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పుల్లయ్య, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : 29 ఆకారంలో కూర్చొని ఉన్న అంగన్‌వాడీలు

నేరాలకు అడ్డా..

- క్షణికావేశంలో అఘాయిత్యాలు
- మద్యం మత్తులో ఘోరాలు
- ఈజీ మనీ కోసం అడ్డదారులు
- భయాందోళనలో ప్రజలు

నెల్లూరులో వరుస ఘటనలు ● నడిరోడ్డుపై హత్యలు . దారి దోపిడీలు, దౌర్జన్యాలు

ప్రశాంతతకు మారుపేరుగా చెప్పుకునే నెల్లూరు నగరం నేరాలకు అడ్డాగా మారింది. పోలీసులంటే భయంలేకుండా నేరస్థులు రెచ్చిపోతుండటంతో నగరంలో రోజు రోజుకు శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయి. మద్యం మత్తు, క్షణికావేశంలో కొందరు అఘాయిత్యాలకు పాల్పడుతుండగా మరికొందరు ఈజీ మనీ కోసం నేర ప్రవృత్తిని ఎంచుకుంటున్నారు. ఎవరూ లేని అర్ధరాత్రి వేళ ఇళ్లలో దొంగతనాలు జరిగే స్థాయి నుంచి పక్కాగా రెక్కి నిర్వహించి ఇళ్లలోకి ప్రవేశించి దౌర్జన్యాలు, దోపిడీలు, దారి దోపిడీలు, నగర నడిబొడ్డున హత్యలు చేసే స్థాయికి నగరం చేరింది. నగరంలో వరుసగా జరుగుతున్న సంఘటనలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుండగా నేరనియంత్రణ పోలీసులకు సవాలుగా మారుతోంది.

- నెల్లూరు (క్రైం)

ఇలాంటివి ఎన్నో...!

● గతేడాది డిసెంబరు 6వ తేదీ రాత్రి పడారుపల్లి ప్రాంతంలో విజయచంద్రపాల్ అనే వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన విజయ చంద్రపాల్ బుజబుజ నెల్లూరుకు చెందిన హేమలత అలియాస్ పద్మతో మూడేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. పద్మ కుమారుడు జ్యోతి కుమార్ రోకలిబండతో విజయచంద్రపాల్‌పై దాడి చేయడంతో అతను స్పృహ కోల్పోయాడు. తల్లికి విషయం తెలిపి జ్యోతికుమార్ పరారయ్యాడు. ఘటన స్థలానికి చేరుకున్న హేమలత మరో వ్యక్తి సాయంతో చంద్రపాల్‌ను స్కూటీపై ఎక్కించుకొని పడారుపల్లి సుందరయ్య కాలనీ వద్ద వదిలేసి అక్కడి నుంచి పరారైంది. అప్పటికి ప్రాణాలతో ఉన్న చంద్రపాల్‌ను ఎవరూ గుర్తించి, ఆసుపత్రికి చేర్చకపోవడంతో మరణించాడు.

● పూజలతో ఆరోగ్యాన్ని బాగుచేస్తానని నమ్మించి దంపతుల వద్ద రూ.9లక్షలు దోచుకెళ్లిన ఘటన నగరంలో చర్చనీయాశమైంది. సర్వస్వతినగర్ ఆర్‌ఆర్ టవర్స్‌లో శ్రీనివాసులురెడ్డి, రాజమ్మ దంపతులు నివసిస్తున్నారు. వారికి నగరానికి చెందిన సుబ్బారావు బాగా తెలుసు. కొంతకాలంగా శ్రీనివాసులురెడ్డి పక్షవాతంతో బాధపడుతూ వైద్యం చేయించుకుంటున్నాడు. అయినా ఆరోగ్యం కుదట పడకపోవడంతో సుబ్బారావుతో విషయం తెలిపాడు. తనకు తెలిసిన పూజారులు ఉన్నారని, వారితో పూజ చేయిస్తే ఆరోగ్యం కుదటపడుతుందని సుబ్బారావు నమ్మబలికాడు. ఈ క్రమంలో గత ఏడాది డిసెంబరు 15వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో పూజ ప్రారంభించారు. పూజ చివరకు వచ్చిందని ఇంట్లో ఉన్న డబ్బునంతా పూజలో పెట్టి దూరంగా వెళ్లాలని సూచించడంతో భర్త వైద్యం కోసం దాచిన రూ.9లక్షల నగదును రాజమ్మ పూజలో పెట్టింది. ఆ నగదుతో పూజారుల ముసుగులో ఉన్న ఇద్దరు ఉడాయించారు. దీంతో బాధితు లు లబోదిబోమన్నారు.

● కలిగిరి మండలం, పాపన ముసలిపాళెం గ్రామానికి చెందిన గణేష్ మహేంద్ర నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో నివసిస్తున్నాడు. నగరంలోని కామాటి వీధికి చెందిన రాళ్ల సురేష్, కలిగిరి మండలం దూబగుంట గ్రామానికి చెందిన చేవలముడి మధు, బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం ఆముదాలపల్లి గ్రామానికి చెందిన తోకల నాగరాజు, శ్రీకాళ హస్తి ఎంజీ స్ట్రీట్‌కు చెందిన మాకాల మునిరాజు, నెల్లూరు మూలాపేటకు చెందిన బుడంగుం ట కృష్ణ స్నేహితులు. వీరందరు పలు ప్రాంతాలకు చెందిన వారైనా గుప్తనిధులు సంపాదించాలన్న ఆశయం వారిని స్నేహితులుగా మార్చింది. గుప్త నిధుల కోసం ఎంతో డబ్బు ఖర్చు చేయడమేకాక అప్పుల పాలయ్యారు. అయినా గుప్త నిధులపై ఆశ చావలేదు. ఆ నిధుల కోసం మరింతగా ప్రయత్నించడానికి తగిన డబ్బు కోసం దోపిడీకి పథకం వేశారు. వారి స్నేహితులు నెల్లూరులో వృద్ధుడైన ఓ నగల వ్యాపారి వద్ద బంగారం కుదువ పెడుతుండటం తెలుసుకుని ఆ వ్యాపారి ఇంట్లో దోపిడీ చేయాలని నిర్ణయించారు. గతేడాది డిసెంబరు 13వ తేదీన ఆభరణాలు కుదువ పెట్టే నెపంతో వ్యాపారి ఇంట్లోకి ప్రవేశించి అతను, అతని భార్యపై దాడి చేశారు. తాళ్లతో కట్టేసి నోటిలో గుడ్డలు కుక్కి కళ్లలో శానిటైజర్ చల్లారు. ఆ ఇంట్లో ఉన్న 700 గ్రాముల బంగారు నగలు, రూ.15 వేల నగదు దోచుకెళ్లారు.

● బుచ్చిరెడ్డిపాలెం శాంతినగర్‌కు చెందిన షాకీర్, అస్లాం అన్నదమ్ములు. వారు నెల్లూరు వైఎంసీఏ మైదానం సమీపంలో రోడ్డు మీద తోపుడుబండ్లపై పండ్లు విక్రయించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి బుచ్చిరెడ్డిపాళేనికే చెందిన ఘోరా అనే స్నేహితుడున్నాడు. వీరి మధ్య పాత కక్షలున్నాయి. కోర్టులో ఓ కేసు కూడా నడుస్తోంది. ఆ కేసులో రాజీ విషయమై వీరి మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఫ్రెండ్స్‌తో పార్టీ ఉందని ఘోరా తన భార్యకు చెప్పి నెల్లూరుకు వచ్చాడు. షాకీర్‌తో కలిసి ఘోరా కూరగాయల మార్కెట్ ఆవరణంలో మద్యం సేవి స్తుండగా అస్లాం అక్కడకు వచ్చాడు. అందరూ కలిసి మద్యం సేవించారు. అక్కడ వారి మధ్య పాత గొడవలకు సంబంధించి మాటా మాటా పెరిగింది. అది కాస్తా గొడవగా మారడంతో షాకీర్, అస్లాం కత్తులు, బీర్ బాటిళ్ల తో ఘోరాపై విచక్షణా రహితంగా దాడి చేశారు. అక్కడు న్న ఇద్దరు వ్యక్తులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేసినా ఆగలేదు. నిందితులు ఘోరాపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు

● నెల్లూరులోని రామ్మూర్తినగర్ మూడో వీధిలో గల ఓ అపార్ట్‌మెంట్‌లో చంద్రశేఖర్‌రావు, హరికోటేశ్వరరావు అన్నదమ్ములు నివసిస్తున్నారు. వీరు మండపాల వీధిలో బంగారు నగల దుకాణం నిర్వహిస్తున్నారు. ఆభరణాలు విక్రయించడంతో పాటు ఆర్డర్లపై ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పలు బంగారు దుకాణాలకు నగలు సరఫరా చేస్తుంటారు. వీరికి మండపాలవీధికి చెందిన బంగారు వ్యాపారి రామాచారి స్నేహితుడు. ఈ నెల 6వ తేదీన హరికోటేశ్వరరావు తన వద్ద, స్నేహితుని వద్ద ఉన్న సుమారు 2 కేజీల బంగారు ఆభరణాలను తీసుకుని విక్రయించేందుకు గూడూరుకు వెళ్లాడు. అక్కడ కొన్ని ఆభరణాలను విక్రయించగా కొందరు వ్యాపారులు బకాయి తాలూకు రూ.10 లక్షల నగదు ఇచ్చారు. దీంతో హరికోటేశ్వర రావు 1,758 గ్రాము ల బంగారు ఆభర ణాలు, రూ.10 లక్షల నగదును బ్యాగ్‌లో పెట్టుకుని ఈ నెల 6వ తేదీ రాత్రి గూడూరు నుంచి ఆర్టీసీ బస్సులో నెల్లూ రుకు బయలుదేరారు. అన్న చంద్రశేఖర్ రావు ఆర్టీసీ బస్టాం డుకు వెళ్లి హరికోటేశ్వర రావును బైక్‌పై ఎక్కించుకుని ఇంటి కి బయలుదేరారు. రామలింగాపురం అండర్ బ్రిడ్జి మీదుగా న్యూ జ్యోయాలుకాస్ జ్యూయలరీ షాపు సమీపంలోకి వచ్చే సరికి ముఖానికి మాస్క్ ధరించిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి వారిని అడ్డుకున్నారు. ఓ వ్యక్తి బైక్ దిగి బంగారు వ్యాపారులపై దాడి చేసి నగల బ్యాగ్‌ను లాక్కుని బైక్‌పై పరారయ్యాడు. హఠాత్తుగా జరిగిన దాడితో నివ్వెరపోయిన అన్నదమ్ములు తేరుకొనేలోపే దుండగులు అందరూ పారిపోయారు.







శభాష్.. పోలీస్ !



మనుబోలు-పొదలకూరు మార్గంలో కంకరతో గుంతలు పూడిపిస్తున్న ఎస్‌ఐ అజయ్‌కుమార్

మనుబోలు, జనవరి 9: మనుబోలు-పొదలకూరు మార్గంలో గోతులు ఎక్కువయ్యాయి.ఇవి ప్రయాణికులను భయపెడుతున్నాయి. ఈనెల 6న ఈ గోతుల్లో పడి మండల బీజేపీ అధ్యక్షుడు ఓడూరు శ్రీనువాసులురెడ్డి దుర్మరణం చెందాడు. ప్రాణాలు పోతున్నా ప్రభుత్వంకానీ, ఆర్‌అండ్‌బీ అధికారులు కాని ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో మనుబోలు ఎస్‌ఐ గంటా అజయ్‌కుమార్ స్పందించారు. టిప్పర్ ద్వారా గోతుల్లో సన్న కంకర తీసుకువచ్చి పూడిపించారు. ఈ మార్గంలో ప్రయాణికులు అతివేగంతో వెళ్లరాదని ఆయన సూచించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల ప్రజలు శభాష్ అంటూ పోలీసులను అభినందించారు.

రెండు గడ్డివాముల దగ్ధం



కాలిపోతున్న గడ్డి వాములు

కొండాపురం, జనవరి 9: మండలంలోని సాయిపేట పంచాయతీ ఇస్కపాలెంలో 17 ఎకరాలకు సంబంధించిన రెండు గడ్డివాములు మంగళవారం దగ్ధమయ్యాయి. బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గణిపనేని కొండబాబుకు సంబంధించిన సుమారు 10 ఎకరాలు, గణపనేని మధుకు చెందిన సుమారు 7 ఎకరాల వరిగడ్డిని వేర్వేరుగా రెండు వాములు వేశారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో రెండు గడ్డి వాములు పూర్తిగా దగ్ధమయ్యాయని బాధితులు ఆరోపిస్తున్నారు. గతేడాది వరి పంట సాగుచేయకపోవడంతో ఎకరం గడ్డిని రూ.10 వేలు చెల్లించి కొనుగోలు చేసి పశువుల మేత కొరకు వాములు వేసుకున్నామన్నారు. ఊరి మధ్యలోనే ఉన్నప్పటికీ అంగతకులు నిప్పు పెట్టారన్నారు. మంటలు ఎగిసి పక్కనున్న ఇండ్లకు అంటుకోకుండా నీరు చల్లుకున్నారు. కందుకూరు అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించనప్పటికీ వారు ఘటనా స్థలానికి చేరుకునేసరికి పూర్తిగా కాలిపోయాయి. దీంతో పశువులకు మేత లేకుండాపోయిందని బాధితులు వాపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

గౌరవరం ఎస్టీ కాలనీలో నాలుగు పూరిళ్ల దగ్ధం

● కట్టుబట్టలతో మిగిలిన గిరిజనులు



గౌరవరం గిరిజన కాలనీలో దగ్ధమవుతున్న ఇళ్లు

కావలి రూరల్, జనవరి 9: మండలంలోని గౌరవరం ఎస్టీకాలనీలో సోమవారం అర్ధరాత్రి నాలుగు పూరిళ్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.4 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు వాపోతున్నారు. బాధితుల కథనం మేరకు.. కాలనీకి చెందిన దాసరి కోటేశ్వరరావు, కట్టా కోటేశ్వరిల ఇళ్లకు తాళాలు వేసుకుని వేరేఊర్లకు వెళ్లారు. అర్ధరాత్రి వారి ఇళ్ల నుంచి వ్యాపించిన మంటలు పక్కనున్న జగన్నాథం శారద, దాసరి శివకు చెందిన ఇళ్లకు వ్యాపించడంతో వారు కేకలు వేస్తూ ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. అనంతరం అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా హుటాహుటిన అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మిగతా పూరిళ్లకు మంటలు వ్యాపించకుండా ఆర్పినప్పటికీ ఆ నాలుగు ఇళ్లు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. దీంతో బాధితులు కట్టుబట్టలతో నిరాశ్రేయులుగా మిగిలారు. ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజనులు కన్నీటి పర్యంతమయ్యారు.

రైలు కట్టపై మృతదేహం

నెల్లూరు(క్రైం), జనవరి 9: నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండు సమీపంలో రైలు కట్టపై మంగళవారం గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 35-40 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి మృతి చెందాడు. మృతదేహంపై ఎరుపు, తెలుపు, బులుగు రంగు గళ్ల చొక్కా, నీలం రంగు జీన్స్ ప్యాంటు ఉన్నాయి. కుడి చేతిపై అమ్మ అని పచ్చబొట్టు, ఛాతీపై బంగారమ్మ, బంగారి, బన్ని అని పచ్చబొట్లు ఉన్నాయి. మృతదేహం ఎవరిదని తెలుసుకునే ఆధారాలు లభించలేదు. సోమవారం అర్ధరాత్రి రైలు కింద పడటం వల్ల మృతి చెందాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలిం చి రైల్వే ఎస్‌ఐ ఎన్ హరిచందన కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	95
లేయర్ లైవ్	80
స్కిన్ చికెన్	180
స్కిన్‌లెస్	200
లేయర్	136

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5952
వెండి కిలో ధర	రూ. 73,900
వెండి ఒక గ్రాము	రూ. 75.90

గంగమ్మ ఆలయంలో చోరీ

నెల్లూరు(క్రైం), జనవరి 9: నెల్లూరు నగరంలోని పడారుపల్లిలో గ్రామదేవత గంగమ్మ ఆలయంలో మంగళవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. సోమవారం రాత్రి పూజల అనం తరం అర్చకుడు ఆలయానికి తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. మంగళవారం తెల్లవారు జామున గుర్తుతెలియని దుండగుడు ఆలయంలోకి ప్రవేశించాడు. గర్భాలయం తాళాలు పగుల గొట్టి అమ్మవారి మెడలోని బంగారు మంగళ సూత్రాన్ని తెంపుకుని పరారవుతుండగా ఆలయ కమిటీ సభ్యుడు శ్రీహరి అన్న కుమారుడు వినయ్ గమనించి దుండగుడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా అతను పారిపోయాడు. శ్రీహరి ఫిర్యాదుతో వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ దేవస్థానానికి చేరుకుని అక్కడి సీసీ కెమెరాలను పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాథమిక దశలోనే గుర్తిస్తే కుష్ఠును నయం చేయవచ్చు

● ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలీ



సర్వే తీరును పరిశీలిస్తున్న డాక్టర్ ఖాదర్‌వలి

నెల్లూరు (వైద్యం), జనవరి 9 : ప్రాథమిక దశలోనే కుష్ఠువ్యాధిని గుర్తిస్తే వైద్య చికిత్సల ద్వారా నయం చేయవచ్చని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. మంగళ వారం నెల్లూరులోని ఎన్‌బీటీ కాలనీలో చేపడుతున్న కుష్ఠువ్యాధి సర్వే తీరును పరిశీలించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. వ్యాధిని మొదటి దశలో గుర్తిస్తే అంగవైకల్యం నుంచి బాధితులను కాపాడవచ్చని తెలియచేశారు. పప్పులవీధి పట్టణ ఆరోగ్య కేంద్రంలోనూ, డేమియన్ ఫౌండేషన్ నిర్వహించే ఆసుపత్రులలోనూ కుష్ఠువ్యాధికి ఉచిత చికిత్సలు అందిస్తారన్నారు. కుష్ఠు వ్యాధి సర్వేకు పట్టణ ప్రజలు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ రీనాభారతి, కమ్యూనిటీ ఆర్గనైజర్ కొండాపురం వెంకటేశ్వర్లు, అమరావతి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఎన్‌ఎస్‌ఎస్ అవార్డ్స్‌కు నలుగురి ఎంపిక



ఎన్‌ఎస్‌ఎస్ అవార్డ్సుకు ఎంపికైన వారితో వీసీ సుందరవల్లి

వెంకటాచలం, జనవరి 9: రాష్ట్ర స్థాయి ఎన్‌ఎస్‌ఎస్ అవార్డ్సుకు వీఎస్‌యూ నుంచి నలుగురు ఎంపికయ్యారు. రాష్ట్ర ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ పీ ఆశోక్‌రెడ్డి మూడు కేటగిరిల్లో అవార్డులు ప్రకటించారు. ఎన్‌ఎస్‌ఎస్ రాష్ట్ర ఉత్తమ సమన్వయకర్త కేటగిరిలో వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగానికి సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, ఉత్తమ ప్రోగ్రామ్ ఆఫీసర్ కేటగిరిలో కావలి శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో ప్రోగ్రామ్ అధికారి వెంకట సాయితేజ, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల కేటగిరిలో గూడూరు ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడవ సంవత్సరం డిగ్రీ చదువుతున్న పల్లవు ప్రియ, వీఎస్‌యూ కళాశాలలో బయోటెక్నాలజీలో ఎంఎస్సీ చదువుతున్న ఎం పృథ్వీరాజులను ఎంపిక చేశారు. వీరిని మంగళవారం వీఎస్‌యూ వీసీ సుందరవల్లి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి, వర్సిటీ ప్రిన్సిపాల్ విజయానంద్‌కుమార్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వకపోతే ఎలా బతకాలి?

● షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగులు, కార్మికుల నిరసన



షుగర్ ఫ్యాక్టరీ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు, ఉద్యోగులు

కోవూరు, జనవరి 9 : కోవూరు షుగర్ ఫ్యాక్టరీలో కార్మిలు, ఉద్యోగులకు గత 10 ఏళ్లగా జీతాలు ఇవ్వకపోతే ఎలా జీవించాలని సీఐటీయూ నాయకులు దయాకర్, మల్లికార్జున్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కోవూరు మండల పోతిరెడ్డిపాలెం షుగర్ ఫ్యాక్టరీ ఎదుట తమకు రావాల్సిన జీతభత్యాలు, బకాయిల కోసం షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు, ఉద్యోగులు చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారం మూడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి, మంత్రి దృష్టి కి తీసుకెళ్లినా ఎటువంటి స్పందన లేదన్నారు. ఇప్పటికే కనీస వేతనాలు లేక 67 మంది కార్మికులు చనిపోయారన్నారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న కార్మిక ఉద్యోగులు కుటుంబ పోషణలేక నరకయాతన పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి కోవూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మిక, ఉద్యోగుల సమస్యలపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో ఎస్‌ఆర్‌పురం విద్యార్థుల ప్రతిభ



స్విమ్మింగ్‌లో ర్యాంకులు సాధించిన రవిచంద్ర, మణికంఠ

సీతారామపురం, జనవరి 9 : న్యూఢిల్లీలో ఈనెల 3 నుంచి 9 వరకు జరిగిన 67వ జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో సీతారామపురం గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ పీ చెన్నయ్య కుమారులు రవిచంద్ర, మణికంఠలు 6 ,9 ర్యాంకులు సాధించారు. జాతీయ స్థాయిలో సీతారామపురం గ్రామానికి గుర్తింపు తెచ్చినందుకు మంగళ వారం చెన్నయ్య ఇంటి వద్ద స్థానికులు, బంధుమిత్రులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడు తూ తన పిల్లలు ఈ స్థాయికి రావటానికి కారణమైన ఆ క్వాటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.సనత్ కుమార్, కోచ్ డీ నాగరాజులకు ధన్యవాదాలు తెలిపారు.

104లో నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (వైద్యం), జనవరి 9 : వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని 104 అంబులెన్స్‌లో డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల నియామకానికి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా మేనేజర్ వెంకటరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు డిగ్రీతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారు అర్హులని తెలిపారు. డ్రైవర్‌కు 10వ తరగతి అర్హత ఉండాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని 104 కార్యాలయంలో అందచే యాలని, మరింత సమాచారం కోసం 85550 47203 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వైసీపీ పాలనలో మసకబారిన నెల్లూరు ప్రతిష్ట

● రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమిని ఆదరించండి ● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర



విలేకరులతో మాట్లాడుతున్న బీద రవిచంద్ర

నెల్లూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : గొప్ప చరిత్ర కలిగిన నెల్లూరు జిల్లా ప్రతిష్ట వైసీపీ పాలనలో మసక బారిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర అన్నారు. మంగళవారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ నలువైపులా వ్యాపార సామ్రాజ్యాలు నిర్మించి, నెల్లూరు కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేసిన పారిశ్రామిక వేత్తలు, పెద్ద రెడ్లను సీఎం జగన్మోహన్‌రెడ్డి కీలుబొమ్మల్లా మార్చారని వ్యాఖ్యానించారు. ఆత్మాభిమానం తాకట్టు పెట్టలేక, జగన్‌ను ఎదురించి నిలవలేక, వ్యాపారం పట్ల మమకారం వీడలేక, లాభాలను వైసీపీ నేతలకు దోచిపెట్టలేక పారిశ్రామిక వేత్తలు నలిగిపోతున్నారన్నారు. 'జిల్లాలో జరుగుతున్న అక్రమ మైనింగ్, వైసీపీ నేతల దోపిడీపై సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితోపాటు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణ రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ వంటి నేతలు గళమెత్తారు. మా నాయకులకు సమాధానం చెప్పలేని వైసీపీ హిజ్రాలను ఉసిగొల్పి శిఖండి రాజకీయాలకు తెరలేపింది. తమ పార్టీ నేతల కన్నా హిజ్రాలే మేలు అన్న నిర్ణయానికి సీఎం జగన్మోహన్ రెడ్డి వచ్చారేమోనన్న సందేహం కలుగుతోంది. వైసీపీకి ఒక్కసారి అధికారం ఇస్తేనే బడా పారిశ్రామిక వేత్తలు, పెద్దా రెడ్ల వ్యాపారాలను తీసేసుకున్నారు. మరోసారి అధికారంలోకి వస్తే సామాన్యుల ఇళ్లను కూడా లాగేసుకుంటారు' అని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జిల్లా మంత్రులుగా ప్రాతినిధ్యం వహించిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అనీల్‌కుమార్ యాదవ్, ఎంపీలైన ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మద్దిల గురుమూర్తి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావులు జిల్లా ప్రజలకు ఏం చేశారో ఆలోచించాలని కోరారు. ప్రజలంతా ఆలోచించుకోవాలని, నెల్లూరు జిల్లా అభివృద్ధి ఒక్క టీడీపీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమిని ఆదరించి, తమ అభ్యర్థులను గెలిపించాలని బీద కోరారు. ఈ సమావేశంలో నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, తాళ్లపాక అనురాధ, పనబాక భూలక్ష్మి, షేక్ అమ్మల్లా, దర్శి హరికృష్ణ పాల్గొన్నారు.

ప్రణాళికలు పటిష్టంగా రూపొందించాలి

● జడ్పీ సీఈవో చిరంజీవి, డీపీవో సుస్మిత

నెల్లూరు (జడ్పీ), జనవరి 9: జిల్లాలోని గ్రామాల అభివృద్ధి ప్రణాళికలను పటిష్టంగా రూపొందించాలని జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత, జడ్పీ సీఈవో చిరంజీవి అధికారు లను ఆదేశించారు. గ్రామాల అభివృద్ధి ప్రణాళిక తయారీపై జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. వారు మాట్లాడుతూ పంచాయ తీరాజ్ శాఖ అధికారులంతా గ్రామ అభివృద్ధి ప్రణాళికలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో బాలసభ, మహిళాసభ, ప్రత్యేక గ్రామ సభలను నిర్వహించి, అన్ని శాఖ లను సమన్వయం చేసుకుని ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామాలకు మంజూరయ్యే నిధులను వినియోగించుకునే విధంగా ప్రణాళికలు ఉండాలన్నారు. నెలాఖరుకల్లా పూర్తిచేసి ప్రభుత్వ వెబ్‌పోర్టల్‌లో పొందుపరచాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవోలు, డీఎల్‌పీవోలు, పంచాయతీ రాజ్ అధికారులు పాల్గొన్నారు.

నేడు మెప్మా ప్రాంతీయ వర్క్‌షాపు

నెల్లూరు(హరనాథపురం), జనవరి 9 : మెప్మా ప్రాంతీయ స్థాయి వర్క్‌షాపు బుధవారం నెల్లూరులోని మహేశ్వరీ పరమేశ్వరీ కల్యాణ మండపంలో జరగనుంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సదస్సు జరుగుతుందని మెప్మా పీడీ రవీంద్ర ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మెప్మా మిషన్ డైరెక్టర్ వీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో స్టేట్ మిషన్ మేనేజర్లు, వివిధ జిల్లాల మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్లు, సాంకేతిక నిపుణులు, సిటీ మిషన్ మేనేజర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, సీఎల్‌ఆర్‌పీలు పాల్గొంటారని తెలిపారు.

న్యాయవాదుల ఉద్యమం కోసం ప్రత్యేక కమిటీ

నెల్లూరు (లీగల్), జనవరి 9 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టాలనుకుంటున్న ఆంధ్రప్రదేశ్ టైటలింగ్ యాక్ట్-2023కి వ్యతిరేకంగా న్యాయవాదులు చేస్తున్న ఆందోళనను ఉధృతం చేసేం దుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీ ఉమామహేశ్వర్ రెడ్డి, ఎం సుందరయ్య యాదవ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ కమిటీలో న్యాయవాదులు ఎం బ్రహ్మం కన్వీనర్‌గా, వై విజయభాస్కర్ రెడ్డి, బద్దెపూడి రవీంద్ర, వీవీ దుర్గా ప్రసాద్, చుక్కా రమేష్ సభ్యులు ఉంటారని తెలిపారు. టైటలింగ్ చట్టం వల్ల కలిగే కష్టనష్టాలను ప్రజల్లోకి తీసుకెళ్తారన్నారు. ఉద్యమంలో భాగంగా అవుటాఫ్ ఆర్డర్, బెయిళ్లు కూడా వేయకూడదని 'బార్' తీర్మానం చేయడంతో కోర్టులలో ఎక్కడి కార్యకలాపాలు అక్కడే నిలిచిపోతున్నాయి. కాగా, మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి జిల్లా కోర్టు ప్రాంగణం ముందు నినాదాలు చేశారు.

ఘనంగా సామాజిక సమతా సంకల్పం



ఫ్లెక్సీపై సంతకం చేస్తున్న జేసీ కూర్మనాథ్

నెల్లూరు(సిటీ), జనవరి 9 : నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో మంగళవారం సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్పొరేషన్ మేయర్ స్రవంతి, జేసీ కూర్మనాథ్, కమిషనర్ వికాస్ మర్మత్ ప్రసంగించారు. ఈ నెల 19న విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించనుందన్నారు. ఈ నేపథ్యంలో వరుసగా పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అణగారిన వర్గాలకు రాజకీయ, సామాజిక హక్కులు కల్పిస్తూ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించారన్నారు. అనంతరం ఫ్లెక్సీలపై సంతకాలు సేకరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో చిరంజీవి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఏడీసీ శర్మద, డీసీ చెన్నుడు, టీపీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు అంబేద్కర్



ఆత్మకూరు : సంతకం చేస్తున్న ఆర్డీవో మధులత

ఆత్మకూరు, జనవరి 9 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదర్శప్రాయుడని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆర్డీవో కే మధులత అధ్యక్షతన జన్ భగీదారి కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించి సంతకాల సేకరణ చేపట్టారు. ముందుగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైసీపీ నాయకులు అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జీ వెంకటరమణమ్మ, కమిషనర్ బి నాగేశ్వరరావు, ఎంపీడీవో పీ ఐజాక్‌ప్రవీణ్, జేఏసీ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, వైసీపీ నాయకులు అల్లారెడ్డి ఆనందరెడ్డి, కొండా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సేవలు మరువలేనివని వెంగళరావు నగర్ పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు అమర్‌నాథ్‌రెడ్డి, హీనాలు పేర్కొన్నారు. మంగళవారం జన్ భాగ్యదారిలో భాగంగా సంతకాల సేకరణ చేపటారు. కార్యక్రమంలో సర్పంచి మొంద్రు తిరుపతయ్య, నాయకులు మహ్మద్‌ఖాజా, సిబ్బంది పాల్గొన్నారు.

సంగం : స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద జన్‌భగీదారి కార్యక్రమంలో భాగంగా తహసీల్దారు నాగరాజు, ఎంపీడీవో గోపీ ఆధ్వర్యంలో మంగళవారం సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో పలువురు అధికారులతోపాటు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సీతారామపురం : జన్ భగీదారి కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మార్వో సుధాకర్‌రావు ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈవో మస్తాన్‌వలి,ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవి, సీనియర్ అసిస్టెంట్ ఖలీల్, కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, చెన్నరాయుడు తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : కార్యక్రమంలో పాల్గొన్న సబ్ కలెక్టరు విద్యాధరి

కందుకూరు : అంబేద్కర్ భావజాలం ఆదర్శనీయం, ఆచరణీయమని సబ్ కలెక్టరు విద్యాధరి అన్నారు. స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన అంబేద్కర్ సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జన్ భగీదారీ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం సబ్ కలెక్టరు కార్యాలయం ఆవరణలో రక్తదాన శిబిరం, ఈనెల 12న అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కళాకారులు, విద్యార్థులు అంబేద్కర్ జీవితచరిత్రపై సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో పద్మజ, మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్, ఎంపీడీవో విజయశేఖర్, ముప్పవరపు కిషోర్, వీవీ శేషయ్య, ఇనకొల్లు మస్తానయ్య, ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చిత్రగుంట : అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న అధికారులు

చిత్రగుంట : మండలంలో సామాజిక న్యాయం పాటిస్తామని బోగోలు తహసీల్దారు హేమంత్‌కుమార్, ఎంపీడీవో వెంకటసుబ్బారావులు అన్నారు. బోగోలు కూడల్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళ వారం సామాజిక సమత సంకల్పంలో భాగంగా రెండవ రోజు సంతకాలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి జయలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం

ఆత్మకూరు, జనవరి 9 : సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని సీఐటీయూ, ఏఐటీయూసీ మున్సిపల్ యూనియన్ నాయకులు తేల్చి చెప్పారు. మంగళవారం వారు తమ విధులను బహిష్కరించి స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావు శిబిరం వద్దకు వచ్చి కార్మికులతో చర్చించారు. సమ్మెను విరమించి విధుల్లో చేరాలని కోరారు. యూనియన్ నాయకులు నిరాకరించారు. కార్యక్రమంలో సీపీఎం నేత కే డేవిడ్‌రాజు, ఏఐటీయూసీ, సీఐటీయూ మున్సిపల్ యూనియన్ నాయకులు బీ హజరత్తయ్య, జంగం నాగరాజు, ఎం చెంచయ్య, పీ కృష్ణయ్య, కే నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : తమ సమస్యలు పరిష్కరించాలని ఏడు రోజులుగా మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవటం దుర్మార్గమని, సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. సమ్మెలో భాగంగా కందుకూరు మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షలు మంగళవారం కూడా కొనసాగాయి. సాయంత్రం దీక్షల ముగింపు సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూల ఆధ్వర్యంలో పట్టణంలోని పోస్టాఫీసు సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా కార్మికసంఘాల నాయకులు మాట్లాడుతూ సమస్య పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కాకుమాని రమణమ్మ, పులి నాగేశ్వరరావు, మెండా మహేంద్ర, శేషమ్మ, కొండమ్మ, ఏఐటీయూసీ నాయకులు బూసి సురేష్‌బాబు, వై. ఆనంద్‌మోహన్, మురళి, సీఐటీయూ నాయకులు ఎస్ఏ గౌస్, పవన్ పాల్గొన్నారు.



కావలి టౌన్ : ధర్నాలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

కావలిటౌన్ : ప్రభుత్వానికి మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పట్టడం లేదని ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్లి అంకయ్య పేర్కొన్నారు. సమ్మెలో భాగంగా పారిశుధ్య కార్మికులు మంగళవారం శిబిరం వద్ద విప్లవ గీతాలతో కోలాటం వేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నేత నాగరాజు, యూనియన్ నాయకులు ఆదినారాయణ, వెంకటేష్, రవి, రాజేష్, లక్ష్మమ్మ, పద్మ, రమాదేవి పాల్గొన్నారు.

● సీఐటీయూ ఆధ్వర్యంలో అనుబంధ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మె మంగళవారం 15వ రోజు కొనసాగింది. కార్యక్రమంలో యూనియన్ నేతలు తురకా శీనయ్య, బీ రమేష్, వో రమేష్, రాజ్యలక్ష్మి, చిన్నమ్మ, రాజేశ్వరి, అనిత తదితరులు పాల్గొన్నారు.

చవిటివాగులో ఆక్రమణల పరిశీలన



చవిటి వాగు ఆక్రమణపై రైతులతో మాట్లాడుతున్న ఏఈ కృష్ణ

సంగం, జనవరి 9: మండలంలోని తలుపూరుపాడు పొలాల్లో ఉన్న చవిటివాగు ఆక్రమణలను ఇరిగేషన్ ఏఈ బీవీ కృష్ణ మంగళవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన ఓ రైతు వాగుకు ఇసుక బస్తాలతో అడ్డు కట్ట వేసి ఆక్రమణకు పాల్పడుతున్నారని, దీంతో ఎగువ పొలాలు ముంపునకు గురవుతున్నాయని స్పందనలో కొందరు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీంతో ఏఈ చవిటి వాగును పరిశీలించారు. ఆక్రమణదారులను పిలిచి మందలించారు.

నేటి నుంచి గ్రామసభలు

ఉదయగిరి రూరల్, జనవరి 9: మండలంలోని అన్ని పంచాయతీల్లో బుధవారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఈశ్వరమ్మ మంగళవారం తెలిపారు. 10న గండిపాళెం, 11న వెంగళరావునగర్, తిరుమలాపురం, 12న అప్పసముద్రం, దాసరిపల్లి, 13న ఉదయగిరి, కొండాయపాళెం, 14న గన్నేపల్లి, నేలటూరు, 16న ఆర్లపడియ, కృష్ణంపల్లి, 17న జీ.చెర్లోపల్లి, చెరువుపల్లి, 18న బండగానిపల్లి, అయ్యవారిపల్లి, 19న పుల్లాయపల్లి, శకునాలపల్లి పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

నిధులు మంజూరైనా సాగని పనులు



మర్రిపాడు ఎస్సీ కాలనీకి వెళ్లే దారి

మర్రిపాడు, జనవరి 9 : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అధికారులను పక్కన ఉంచుకొని, గ్రామాల్లో సమస్యలను గుర్తించారు. ప్రధానంగా మురుగు కాలువల నిర్వహణ, సిమెంట్ రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. అయితే ప్రభుత్వం ప్రతి సచివాలయానికి మొదటి విడతగా రూ. 20లక్షలు, రెండవ విడతగా మరో రూ. 20లక్షలు కలిపి రూ. 40 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. మండలంలో మొత్తం 17సచివాలయాల పరిధిలో మొదట విడత నిధుల పనులు పూర్తి అయ్యాయి. కానీ మర్రిపాడుతోపాటు ఇర్లపాడు, భీమవరం, చాబోలు, ఎమ్మెల్యే స్వంత గ్రామం బ్రాహ్మణపల్లిలో ఇంతవరకు మొదటి విడత పనులు ప్రారంభం కాలేదు. ఇందుకు ప్రధాన కారణం సర్పంచుకు, నాయకులకు మధ్య సమన్వయ లోపమే. రెండవ విడతలో మరో రూ. 20లక్షలు మంజూరు కాగా మండలంలో ఒక్కచోట కూడా పనులు ప్రారంభించలేదు. కలెక్టరు నెలకు మూడు, నాలుగుసార్లు మండల అధికారులతో సమావేశాలు నిర్వహించినా ఉపయోగం లేకుండా పోయింది.

12 నుంచి మండల స్థాయి క్రికెట్ పోటీలు

వలేటివారిపాలెం : మండలంలోని పోలినేనిపాలెంలో సంక్రాంతి సందర్భంగా అరుణోదయ యూత్ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు 10వ వార్డు సభ్యుడు ఎండ్లూరి ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే టీంలు ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించాలన్నారు. గెలుపొందిన టీంలకు మొదటి బహుమతి రూ.15 వేలు, 2వ బహుమతి రూ.10 వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

ఊళ్లన్నావ్.. ఇళ్లే లేవు జగన్ ! : బొల్లినేని



పేదల గుడిసెను చూపుతున్న బొల్లినేని

ఉదయగిరి రూరల్, జనవరి 9: తమ ప్రభుత్వం ఇళ్లు కాదు.. ఊళ్లే నిర్మిస్తున్నదంటూ ప్రగల్భాలు పలికే సీఎం జగన్‌రెడ్డి ఒక్కసారి పేదల గుడిసెల వైపు చూడాలని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పీ చెంచలబాబుయాదవ్‌తో కలిసి పట్టణంలోని స్టేటిపేట, బీసీ, ఎస్టీ కాలనీల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకుడు ఆనందరావు కుమారులు శ్రావణ్‌కుమార్, జాన్సన్ తమ అనుచరులతో టీడీపీలో చేరగా, వారికి బొల్లినేని కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బయ్యన్న, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, నరసింహ, సజిల్ మాబాషా, ఖాన్‌సా, అబ్బయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి అభివృద్ధికి సహకరించండి



కేక్ కట్ చేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి, జనవరి 9: ఉదయగిరి అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కోరారు. మంగళవారం మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి నివాసంలో మండల వైసీపీ నాయకులతో సమీక్షించారు. ఈనెల 12న ఉదయగిరిలో జరిగే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బహిరంగసభ విజయవంతమయ్యేలా చూడాలని కోరారు. జనగన్న ప్రజా సంకల్ప యాత్ర ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న వైసీపీ నాయకుడు ఎంఏ రియాజ్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు జీ.ఓబులరెడ్డి, ఉప్పుటూరి శ్రీనివాసులు, గడియాల్లీ ఎస్థానీ, పెంచలయ్య, యస్ధాన్, హరి, అక్కి భాస్కర్‌రెడ్డి, ఉప సర్పంచి ముర్తుజా తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో చిన్నారులు, ఉపాధ్యాయులు

ఆత్మకూరు, జనవరి 9 : మున్సిపాలిటీ పరిధిలోని ప్రగతి ఇంగ్లీష మీడియం హైస్కూల్‌లో మంగళవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. విద్యార్థులు పట్టుపంచెలు, విద్యార్థినులు పట్టు లంగాలు ధరించడంతో నూతన శోభ సంతరించుకుంది. హరిదాసులు, గొబ్బెమ్మలు, బొమ్మల కొలువు, భోగి పండ్లు వంటివి ఏర్పాటు చేశారు. చిన్నారులు హరిదాసుల వేషాలు, సంక్రాంతి పాటలు, డ్యాన్స్‌లతో అలరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎస్ రామ్మోహన్‌రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతసాగరం : స్థానిక వికాస్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రంగవల్లు పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఖాదర్‌వలి, హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తుప్పు పడుతున్న పరికరాలు



నిరుపయోగంగా ఉన్న పరికరాలు

వరికుంటపాడు, జనవరి 9: దోమల నివారణ కోసం వినియోగించాల్సిన పరికరాలు స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఏళ్ల తరబడి ఇలానే ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఎంతో విలువైన ఆ పరికరాలను కనీసం అట్టపెట్టెల్లో నుంచి బయటకు తీయలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతుంది. దీంతో అవి వినియోగానికి నోచుకోకుండానే తుప్పుపట్టి నాశనమవుతున్నాయి. అధికారులు, ఉద్యోగులు వృథాగా పడిఉన్న పరికరాలను చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే తప్ప ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆ పరికరాలను వినియోగంలోకి తీసుకురావాలని మండల వాసులు కోరుతున్నారు.

పింఛన్ల పంపిణీ

దగదర్తి(చిత్రగుంట): దగదర్తి మండలంలోని దగదర్తి, తడకలూరు గ్రామాల్లో ఎంపీడీవో శీనమ్మ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లూరి వెంకటకృష్ణ ప్రసాద్‌నాయుడు పాల్గొని లబ్ధిదారులకు నగదు పంపిణీ చేశారు. సర్పంచులు శీనయ్య, గిరినాయుడు పాల్గొన్నారు.

ఆందోళన ఉధృతం చేస్తాం..



ఉదయగిరి సీడీపీవో కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



కావలిలో 29 అంకె ఆకారంలో అంగన్‌వాడీలు

ఉదయగిరి, జనవరి 9: కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరుతూ మంగళవారం ఉదయగిరి సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు మోకాళ్లపై నిరసన తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య, ప్రమీలా తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : తమ డిమాండ్లు నెరవేర్చే వరకు పోరు ఆగదని అంగన్‌వాడీలు మంగళవారం కూడా సమ్మె కొనసాగించారు. ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు వారికి మద్దతును ప్రకటించాయి. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జీ శివప్రసాద్, ఆత్మకూరు నాగయ్య, కొండమూరి హజరత్తయ్య, అంగన్‌వాడీ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి రాధ, సెక్టార్ లీడర్లు కె రమణమ్మ, కామేశ్వరి, జమీల తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వినూత్న నిరసన

కందుకూరు : తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించాలని, జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ కందుకూరులో అంగన్వాడీ కార్యకర్తలు మంగళవారం వినూత్న నిరసన తెలిపారు. జీతాలు పెంచేవరకు విధులకు హాజరయ్యేది లేదన్నారు. అంగన్వాడీలు సమ్మె 29వ రోజుకు చేరిన సందర్భంగా 29 అంకెతో కూర్చుని చుట్టూ మానవహారం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు ముప్పరాజు కోటేశ్వరరావు, బోసుబాబులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలపై ఎస్మా ప్రయోగించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుండటం నియంతపోకడకు నిదర్శనమని, వారితో చర్చలు జరిపి సామరస్యంగా సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు రాజేశ్వరి, రహంతున్నీషా, సరస్వతి, ప్రభావతి, రాధ, కేశవకుమారి, సీఐటీయూ నాయకులు డి. రామమూర్తి, ఎస్ఏ గౌస్, ఎస్. పవన్‌కుమార్, టి. వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

29వ రోజుకు చేరిన సమ్మె

కావలిటౌన్ : తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు తలపెట్టిన సమ్మె మంగళవారం 29వ రోజుకు చేరింది. సమ్మె 29 రోజులు పూర్తి చేసుకున్న క్రమంలో 29 అంకె ఆకారంలో అంగన్వాడీలు కూర్చుని నిరసన తెలిపారు. యూనియన్ నేతలు రఘురావమ్మ, వజ్రమ్మ, విజయలత, సుభాషిణిలు మాట్లాడుతూ తమ సమ్మె పట్ల ముఖ్యమంత్రి సానుకూలంగా వ్యవహరించకపోగా ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం అన్యాయమన్నారు. అధికారంలోకి వచ్చాక అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తానని జగన్ మాట ఇవ్వడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మాట తప్పని మడప తిప్పని వంశమని చెప్పి అధికారంలోకి వచ్చాక మాట తప్పి మడమ తిప్పారని ఆరోపించారు. ఎస్మాకు భయపడే ప్రసక్తే లేదని, ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు కృష్ణమోహన్, తాళ్లూరు మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను అనుసరించడమంటే

సంక్షేమ పథకాలు ఎత్తి వేయడమా?

● రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ధర్నా



అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న దళితులు

కావలి, జనవరి 9: దళిత, గిరిజనుల సంక్షేమ పథకాలను ఎత్తి వేసిన జగన్ ప్రభుత్వం అంబేద్కర్‌ను అనుసరిస్తున్నామని చెప్పుకోవడం బాధాకరమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి పేర్కొన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా మంగళవారం కావలి ట్రంకు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారన్నారు. వాటి కోసం కేంద్రం ఇచ్చిన రూ.4,500 కోట్ల నిధులను ఇతర పథకాలకు మళ్లించుకున్న ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు. అలాగే 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి దళిత, గిరిజనులను ఆర్థికంగా దెబ్బతీశారన్నారు. రాష్ట్రంలో 260 మంది దళితులను ఊచకోత కోయడం, 863 మంది దళిత, గిరిజనులపై అక్రమ కేసులు పెట్టడం జగనన్న పాలనలో జరిగిందన్నారు. ఎన్నికలు వస్తుండటంతో దళిత, గిరిజనులను మోసం చేయడానికి అంబేద్కర్ పేరు మీద వారోత్సవాలు నిర్వహించడం మోసపూరితమన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు ముక్క మోహన్‌రావు, ఆలూరు బ్రహ్మయ్య, జరుగుమల్లి విజయరత్నం, జడ్డా వాసు, జీ.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలి

కావలి, జనవరి 9: ప్రధానమంత్రి ఆరోగ్య సురక్ష పథకం ద్వారా గర్భిణులు, బాలింతలు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయుంచుకుని తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలని పట్టణ అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ మేఘనాథచౌదరి తెలిపారు. ప్రధానమంత్రి ఆరోగ్య సురక్ష పథకం కింద డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో మంగళవారం రాజీవ్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం కరోనా, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



బాలింతలకు మందులు అందచేస్తున్న డాక్టర్ మేఘనాథ చౌదరి

కాలువ పనుల వివరాలు మీకెందుకు చెప్పాలి

● సమాధానం చెప్పేందుకు ఏఈ నిరాకరణ ● అధికారి తీరుపై జనసేన నాయకుల ఆగ్రహం



పూడికతీత పనులు వద్ద జనసేన నాయకులు

కలిగిరి, జనవరి 9: సోమశిల ఉత్తర కాలువకు అనుసంధానంగా ఉన్న శ్రీకొలను బ్రాంచి కాలువ పూడికతీత పనులకు సంబంధించి వివరాలు అడిగితే మీకు దిక్కున్న చోట చెప్పుకోండి, వివరాలు ఇవ్వనవసరం లేదని సోమశిల ఉత్తర కాలువ ఏఈ క్రిష్ణయ్య సమాధానం చెప్పారని జనసేన నాయకులు మండిపడ్డారు. మంగళవారం పూడికతీత పనులు జరుగుతున్న ప్రదేశానికి స్థానిక రైతులతోపాటు జనసేన నాయకులు వెళ్లి పనులకు సంబంధించి పూర్తి వివరాలు, పనులు చేస్తున్న కాంట్రాక్టరు వివరాలు అడిగితే సమాధానం చెప్పనవసరం లేదని వ్యంగంగా మాట్లాడటంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని జనసేన మండల కన్వీనర్ బీ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఏటా లక్షలాది రూపాయలతో కాలువ పూడికతీత పనులకు అధిక మొత్తంలో నిధులు మంజూరు చేయించుకొని ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం జరుగుతుంటే ఊరుకోబోమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కావలిటౌన్, జనవరి 9: యాదవ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ మంగళవారం పట్టణంలోని దొడ్ల మనోహర్ నారాయణ కల్యాణ మండపంలో జరిగింది. ముఖ్య అతిథులుగా ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్మన్ నగళ్ల శ్రీనివాస్‌కిరణ్, ఆచారపు పెద్దింటి యాదవ్ సమాది వెంకటకృష్ణ, బీజేపీ నాయకులు బ్రహ్మానందం, మాజీ కౌన్సిలర్ సన్నిబోయిన నారాయణ తదితరులు పాల్గొని క్యాలెండర్ ఆవిష్కరించారు. ఇటీవల డాక్టరేట్ పొందిన సూర్యనారాయణ, సన్నిబోయిన నారాయణలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎపా రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి బూచి మధుసూదన్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మేక మహేష్, జిల్లా ఉపాధ్యక్షుడు గొబ్బెళ్ల కృష్ణయ్య, రమణయ్య, వంటేరు మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ ప్రతిష్ఠ ప్రదర్శనకు అనుమతివ్వండి


నెల్లూరు (స్టోన్ హౌస్‌పేట) : ఈ నెల 22వ తేదీ అయోధ్యలో జరిగే రామాలయ ప్రారంభోత్సవం, శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించేందుకు అనుమతి ఇవ్వాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ కోరారు. ఈ మేరకు మంగళవారం దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ శ్రీనివాసరావుకు సిబ్బంది ద్వారా వినతిపత్రం అందించారు. ఉదయగిరిలోని రంగనాయకుల స్వామి ఆలయ ప్రాంగణంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా రాముల వారి ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తులు వీక్షించేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

131 పింఛన్ల మంజూరు

లింగసముద్రం, జనవరి 9 : మండలానికి కొత్తగా 131 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో యు శేషుబాబు మంగళవారం చెప్పారు. కొత్తగా పింఛన్ మంజూరైన వారికి నగదు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

డ్రైవర్లకు నష్టం కలిగించే జీవో రద్దు చేయాలి

● ఎస్‌డబ్ల్యూఎఫ్ నిరసన



కందుకూరు డిపో గ్యారేజీ వద్ద నిరసన తెలుపుతున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు, డ్రైవర్లు

కందుకూరు, జనవరి 9: కేంద్ర ప్రభుత్వం డ్రైవర్లకు తీరని నష్టం చేసే ప్రమాదకరమైన జీఓను విడుదల చేసిందని, ఈ జీఓను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కందుకూరులో ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ డ్రైవర్లు మంగళవారం నిరసన తెలిపారు. స్థానిక డిపో గ్యారేజీ గేటు వద్ద నిరసన కార్యక్రమంలో పలువురు సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రమాదాలు జరిగితే విచారణ కూడా లేకుండా డ్రైవర్లకు శిక్ష విధించేందుకు వీలు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం జీఓ విడుదల చేసిందని, ఇది కేవలం ఆర్టీసీ డ్రైవర్లకే కాదు ప్రతి ఒక్కరికీ ప్రమాదకరమేనని పేర్కొన్నారు. ఎలాంటి ముసాయిదా లేకుండా ముందస్తు చర్చలు లేకుండా ఈ జీఓను తేవడం అన్యాయమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు ఏఎస్ రావు, ఎస్కే రబ్బాని, కేవిఎస్ రావు, వేమూరి వెంకటేశ్వర్లు, ఆటో యూనియన్ నాయకులు మాధవ్, సీఐటీయూ నాయకులు ఎస్ఏ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం : ఎమ్మెల్యే

కావలి రూరల్, జనవరి 9: పేదరిక నిర్మూలనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం అని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఆముదాలదిన్నెలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆముదాల దిన్నె, మన్నంగిదిన్నె, సర్వాయపాలెం, తాళ్లపాలెం సర్పంచులు ఊడా బ్రహ్మానందం, చలంచర్ల ప్రభాకర్ రెడ్డి, యానాది, కటికాల సురేష్, జట్పీటీసీ జంపాని రాఘవులు, మాజీ జడ్పీటీసీ శ్రీనివాసులు, ఏఎంసీ చెర్మన్ సన్నిబోయిన ప్రసాద్, సచివాలయ కన్వీనర్ నాగన్నగారి శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు స్టడీ మెటీరియల్

కావలి, జనవరి 9: నిరుద్యోగులకు కాంపిటేటీవ్ ఎగ్జామ్స్‌కు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను తన ట్రస్ట్ ద్వారా ఉచితంగా అందచేస్తానని డాక్టర్ కాకాని మాల్యాద్రి తెలిపారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటీ తిరుపతి వారి ఆధ్వర్యంలో కామర్స్ డిపార్ట్‌మెంట్‌లో ఫైనాన్స్ ఆఫ్ వీకర్స్ సెక్షన్‌పై జరిపిన పరిశోధనలో డాక్టరేట్ ప్రదానం చేశారన్నారు. దీంతో తనకు బాధ్యత పెరిగి మరింత సేవా కార్యక్రమాలు చేస్తానన్నారు. 15 సంవత్సరాలుగా పినాకినీ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా నిరుద్యోగులకు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉపాధి కల్పించానన్నారు.

కోటయ్య మందిరం సమీపంలో జోరుగా మద్యం విక్రయాలు

లింగసముద్రం, జనవరి 9 : లింగసముద్రంలోని ప్రముఖ పుణ్య క్షేత్రంగా భావిస్తున్న తిరుమణిశెట్టి కోటయ్య మందిరం సమీపంలో కొందరు వ్యక్తులు అక్రమ మద్యం విక్రయాలు జోరుగా సాగిస్తున్నట్లు తెలిసింది. ఈ మందిరం పక్కనే ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి తిమ్మారెడ్డిపాలెం వెళ్లే రోడ్డు పక్కన ఉన్న చిల్లచెట్లలో ప్రతిరోజూ ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు మద్యం విక్రయాలు సాగిస్తూ ఒక్కో సీసాపై రూ.20 అదనంగా వసూలు చేస్తున్నట్లు తెలిసింది. అయితే కొందరు వ్యక్తులు అక్కడే మద్యం సేవించి మత్తులో తూలుతుండడం, కొందరు పూటుగా తాగి రోడ్డు పక్కన ఉన్న దుకాణాల వద్ద పడిపోతుండడంతో మందిరానికి వచ్చే భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మందిరానికి కేవలం 100 అడుగుల దూరంలోనే మద్యం విక్రయాలు సాగిస్తువారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

సైదాపురం, జనవరి9: మండలంలోని రాగనరామాపురం, తిప్పిరెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పీఎం నరేంద్ర మోదీ 9ఏళ్ల పరిపాలన కరపత్రాలు, క్యాలెండర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారి శివకుమార్, ఏపీఎం రాధ, ఏవో హైమావతి, పీకేఎస్ గ్యాస్ ఏజెన్సీ ఓనర్ పావులూరి పార్థసారథి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరి డిబార్

వెంకటాచలం, జనవరి 9: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో మంగళవారం జరిగిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ పరీక్షలో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయినట్లు పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ఐదవ సెమిస్టర్ పరీక్షలో 686 మందిగాను 615 మంది హాజరయ్యారు. కాగా నెల్లూరులోని రావూస్ డిగ్రీ కళాశాలలో ఒకరు, కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో ఒకరు డిబార్ అయినట్లు ఆమె తెలిపారు.

నిరుద్యోగులను మోసం చేసిన ఘనత జగన్‌దే!

వెంకటాచలం, జనవరి 9: వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఒక్క ఏడాది కూడా జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా నిరుద్యోగులను మోసం చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ విమర్శించారు. వెంకటాచలంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం తెలుగు యువత నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేక కొందరు మత్తు పదార్థాలకు బానిసై చివరకు ప్రాణాలు కోల్పోతున్నారని, ఈ పాపం జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో 20 లక్షల ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు.

మినగల్లు ఇసుక రీచ్‌లో సర్వే

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 9: మండలంలోని మినగల్లు ఇసుక రీచ్‌లో సర్వే, మైనింగ్, భూగర్భ జల శాఖల అధికారులు, తహసీల్దారు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ఆధ్వర్యంలో మంగవారం సర్వే చేశారు. గతంలో మినగల్లు రీచ్‌లో 5 హెక్టార్లలో ఇసుక తవ్వకాలకు అనుమతులివ్వగా ఈసారి 25 హెక్టార్లలో ఇసుక తవ్వకాల కోసం కొత్తగా అనుమతులు మంజూరు కోసం సర్వే చేపడుతున్నట్లు మైనింగ్ అధికారులు తెలిపారు. ఈ సర్వేలో తహసీల్దారు వీరి సుధీర్, మైనింగ్ సూపర్‌వైజర్ సుధాకర్, భూగర్భజలశాఖ శాస్త్రవేత్త సూర్యతేజారెడ్డి, సర్వే అధికారులు, మండల సర్వేయర్ రమేష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ, ప్రతిమ గ్రూపు ప్రతినిధి, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు వరం ఆరోగ్య సురక్ష

రాపూరు(డక్కిలి), జనవరి 9 : జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరం లాంటిదని మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు నెల్లూరు రవీంద్రారెడ్డి అన్నారు. గోనుపల్లిలో మంగళవారం ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అంతకు ముందు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్య సురక్ష కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాజకుమారి, వైసీపీ నాయకులు పాపకన్ను దయాకరరెడ్డి, నారాయణరెడ్డి, నారసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాకాణి స్కాం అంతుతేలుస్తాం : సోమిరెడ్డి


బలిజపాలెంలో మాట్లాడుతున్న సోమిరెడ్డి

ముత్తుకూరు, జనవరి 9 : సర్వేపల్లి నియోజకవర్గంలో మంత్రి కాకాణి, ఆయన అనుచరులు చేస్తున్న స్కాం అంతు తేల్చేవరకు వదిలేది లేదని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. బలిజపాలెంలో మంగళవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వందలాది ఎకరాల కుంభకోణానికి మంత్రి కాకాణి, అతని అనుచరులు పాల్పడ్డారని ఆరోపించారు. పేదలకు మేలు చేయాల్సిన అధికారులు, అధికార పార్టీ తొత్తులుగా మారారని విమర్శించారు. భవిష్యత్తులో ఈ పాపాల ఫలితాన్ని అధికారులే ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 2300 ఎకరాల భూములకు సంబంధించి లెక్కలు తేలాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొమ్మి సురేంద్ర, పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, మల్లికార్జున్‌యాదవ్, మునిరెడ్డి, కృష్ణయ్య, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి శాలివాహన సమితి అధ్యక్షుడిగా ప్రసాద్

మనుబోలు, జనవరి 9: శాలివాహన సాధికార సమితి సర్వేపల్లి నియోజకవర్గ అధ్యక్షుడిగా మనుబోలు టీడీపీ నాయకుడు చల్లగిరి ప్రసాద్‌ను నియమిస్తున్నట్లు మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, శాలివాహన సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు తులసీదాస్ మంగళవారం ప్రకటించారు. నెల్లూరులోని సోమిరెడ్డి నివాసంలో శాలివాహనులంతా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కమిటీని ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా పెళ్ళూరు హనుమంతరావు, కార్యదర్శిగా దేవరకొండ రామమోహన్‌రావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా మేలసిరి కోటేశ్వరరావు, కోశాధికారిగా తొలికొండ మునికృష్ణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దేవూరు మహేష్‌తోపాటు 20మందిని కార్యవర్గ సభ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా కొత్త కమిటీ అధ్యక్షుడు ప్రసాద్‌కు శాలువాకప్పి, ఘనంగా సన్మానించారు. మిగతా కమిటీసభ్యులను అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొన్నా రవికుమార్, అంబుర సింధూజ, మల్లిరార్జునరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల కన్ను పడిన చోటల్లా అక్రమాలే!

● ప్రతి అడుగు ప్రజల కోసంలో పోలంరెడ్డి దినేష్‌రెడ్డి



బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 9: వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కోవూరు నియోజకవర్గంలో ఏ ప్రాంతంలోనైనా సరే అధికారపార్టీ నాయకుల కళ్లు పడ్డాయంటే ఆ ప్రాంతంలో ఆక్రమణలు, అక్రమాలేనని కోవూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం బుచ్చి నగర పంచాయతీలోని 19వ వార్డు వవ్వేరులో ఆయన ప్రతి అడుగు ప్రజల కోసం కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. కనిగిరి రిజర్వాయర్‌లో ఇష్టానుసారంగా గ్రావెల్ తవ్వకాలు జరపడంతో రిజర్వాయర్ నుంచి లీకేజీలు మొదలై రిజర్వాయర్‌లో నుంచి ఊట బయటకు వస్తుందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రిజర్వాయర్‌లో జరిగిన అక్రమాలు, ఇసుక, మాఫియాలపైన 2019కి ముందు తరువాత రిజర్వాయర్ స్థితి గతులపై గూగుల్ మ్యాప్ మేరకు జరిగిన దోపిడీపై రికవరీ పెట్టిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బత్తల హరికృష్ణ, శివప్రసాద్‌నాయుడు, వెంకటేశ్వర్లునాయుడు, కిషోర్, మహేష్, మీరావళి, జాకీర్, శ్రీనివాసులు, శివ, మంజుల, స్థానిక మహిళలు. నాయకులు, కార్యకర్తలు పలువురు స్థానిక ప్రజలు, పాల్గొన్నారు.

ఎంపీ ఆదాల నివాసానికి మాగుంట

నెల్లూరు(హరనాథపురం), జనవరి 9 : ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి మంగళ వారం నెల్లూరు పార్లమెంటు సభ్యుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి నివాసానికి వచ్చారు. ఆదాల, విజయ డెయిరీ చైర్మన్ కొం డ్రెడ్డి రంగారెడ్డితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఇందుకూరుపేట, జనవరి 9 : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని నందమూరి బసవతారకం మెమోరియల్ అధ్యక్షుడు జాన గిరిబాబు పేర్కొన్నారు. మండలంలోని పల్లిపాడు ఉన్నత పాఠశాల మైదానంలో నందమూరి బసవతారకం మెమోరియల్ 37వ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ప్రారంభమైంది. ఆయన మాట్లాడుతూ 1984 అక్టోబరు 1వ తేదీన ఎన్టీఆర్ సతీమణి బసవతారకం మరణించడంతో ఆమె జ్ఞాపకార్థం బసవతారకం మెమోరియల్ ట్రస్ట్ స్థాపించామని, 40 ఏళ్ల క్రితం ఎన్‌టీ రామారావు ముఖ్యమంత్రిగా జనవరి 9వ తేదీన ప్రమాణ స్వీకారం చేయడంతో దాని గుర్తుగా ప్రతి ఏటా జనవరి 9వ తేదీ ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ టోర్నమెంట్‌లో 28 జట్లు, 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారని పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం జరుగుతున్నందున ఆ కార్యక్రమం లేని రోజు ఈ టోర్నమెంటు జరుగుతుందని తెలిపారు. జనవరి 28న ఫైనల్ పోటీలు జరుగుతాయని, ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుడుముల చిరంజీవి, కోడూరుపాడు మధు, ఎర్ర ధనుంజయ, వింజమూరు వెంకటేశ్వర్లు, పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పెనుబల్లిలో రోడ్డు, కల్వర్టు పనుల ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం : పెనుబల్లి జెండా సెంటర్ మలుపు వద్ద ప్రమాదాలకు నిలయంగా తయారైన రోడ్డు మరమ్మతు పనులను మంగళవారం ప్రారంభిం చారు. ఇటీవల బుచ్చి జొన్నవాడ మార్గంతోపాటు బుచ్చి, చెన్నూరు మార్గంలో రోడ్ల దుస్థితి పై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వరుస కథనాలతో ఎమ్మెల్యే చొరవ తీసుకుని కలెక్టర్‌తో చర్చించారు. ఈ మేరకు ఎఫ్‌డీఆర్ నిధులు రూ.5లక్షలు మంజూరు చేశారని ఆర్ అండ్‌బీ ఏఈ భరత్‌రెడ్డి తెలిపారు. ఈ పనులు 4 రోజుల్లో పూర్తవుతాయని తెలిపారు. కలెక్టర్, ఎమ్మెల్యేలకు పెనుబల్లి సర్పంచు పెంచలయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రసాద్ తదితరులు ధన్యవాదాలు తెలిపారు.

వైసీపీ పాలన అంతమే లక్ష్యం

ముత్తుకూరు, జనవరి 9 : వైసీపీ పాలన అంతమే లక్ష్యమని సర్వేపల్లి నియోజక వర్గ జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు తెలిపారు. మంగళవారం ముత్తుకూరు సెంటర్ నుంచి కృష్ణపట్నం శివాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వాసితుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదన్నారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి నియోజకవర్గంలో ఎక్కడా కూడా అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వీర మహిళా వాణిభవాని, విజయలక్ష్మి, నాయకులు రహీం, అశోక్, సుమన్, గణపతి మస్తాన్, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్యశిబిరం

పొదలకూరు, జనవరి 9: స్థానిక లింగంపల్లి హరిజనవాడలో మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. పొదలకూరుకి చెందిన ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ ఎం.మహేష్ పాల్గొని దంత విద్యార్థులను పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం దంత సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్డీ నాహిద్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి శిలాఫలకం ధ్వంసం

● పోలీసులకు టీడీపీ నేతల ఫిర్యాదు


ఎస్‌ఐకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

కోవూరు, జనవరి 9 : కోవూరు మండలం పోతిరెడ్డి పాలెం శ్రీవాణి కాలనీలో 2018లో అప్పటి పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, శాసన సభ్యుడు పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి చేతుల మీదుగా అభివృద్ధి కార్యక్రమాలు ఆవిష్కరించిన శిలాఫలకాన్ని సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎక్స్‌కవేటర్‌తో ధ్వంసం చేసి చెత్తకుప్పలో పడవేశారు. ఈ మేరకు పోతిరెడ్డి పాలెం గ్రామ దత్తత నాయకుడు తిరుమూరు అశోక్‌రెడ్డి మంగళవారం కోవూరు ఎస్ఐ రంగనాథ్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో పోలీసులు చొరవ తీసుకుని ధ్వంసం చేసిన వారిని పట్టుకోవాలని కోరారు. దీనిపై ప్రత్యేక దృష్టి పెడతానని ఎస్ఐ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నాగరాజు, జొన్నవాడ దేవస్థానం మాజీ సభ్యుడు బాలరవి, మాజీ కో ఆప్షన్ సభ్యుడు జహంగీర్, మాజీ సర్పంచు ప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

బీఎస్పీని ఆదరించండి

తోటపల్లిగూడూరు: బీఎస్పీని ప్రజలు ఆదరించాలని సర్వేపల్లి నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థి జానకీ ప్రసాద్ కోరారు. మండలంలోని పేడూరు, పాపిరెడ్డిపాలెం గ్రామాల్లో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థిగా సర్వేపల్లి నుంచి పోటీ చేస్తున్నానని, ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ, మండల నాయకులు పాల్గొన్నారు.

ఏపీ స్టేట్ ప్రొటెక్షన్ ఫోర్సు ట్రైనింగ్ సెంటర్‌కు స్థల పరిశీలన


జొన్నవాడ తిప్పపైన స్థలం పరిశీలిస్తున్న ఏపీ ప్రొటెక్షన్ ఫోర్స్ కమాండెంట్, ఆర్ఐ

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 9: ఏపీ స్టేట్ ప్రొటెక్షన్ ఫోర్స్ శిక్షణా కేంద్రం భవనం ఏర్పాటు కోసం మండలంలోని జొన్నవాడ తిప్ప ప్రాంతంలో ఆశాఖ అధికారులు, రెవెన్యూ అధికారులతో కలిసి మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. శిక్షణ కేంద్రం ఏర్పాటు కోసం ఇప్పటికే జిల్లాలో పలు ప్రాంతాల్లో స్థలాలను పరిలించి అందులో భాగంగా జొన్నవాడలో తిప్ప ప్రాంతంలో స్థలాన్ని పరిశీలించినట్టు తెలిపారు. స్థల పరిశీలనలో అసిస్టెంట్ కమాండెంట్ ఎంఎస్.రెడ్డి, ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

శిథిల భవనంలోకి
సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

● మరమ్మతులకు రూ.29 లక్షల అంచనా

● దాతల కోసం ఎదురుచూపు


సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి రేబాల వారి వీధిలో కేటాయించిన శిథిల భవంతి



నెల్లూరు(హరనాథపురం), జనవరి 9 : నగరంలోని స్టోన్ హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రేబాలవారి వీధిలో ఉన్న ప్రభుత్వ పూర్వపు చిన్నపిల్లల ఆసుపత్రి వైద్యుల విశ్రాంతి భవనాన్ని కేటాయించారు. ఈ భవనం పూర్తిగా శిథిలావస్థలో ఉంది. మరమ్మతులు చేయిస్తేగానీ భవంతిలోకి కార్యాలయాన్ని మార్చలేని దుస్థితి. ప్రస్తుతం ఆదిత్య నగర్ చిన్నపిల్లల పార్కు సమీపం లోని ఓ అద్దె భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యాలయానికి సొంత భవనం అవసరమని కోరటంతో అధికారులు ఈ శిథిల భవంతిని కేటాయించారు. ఫిబ్రవరి ఆఖరులోగా భవంతిలోకి మారాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆ భవనం మరమ్మతులకు రూ.29 లక్షలు ఖర్చవుతుందని రోడ్లు భవనాలశాఖ వారు అంచనాలను తయారు చేశారు. ఉన్నఫళంగా అంత నగదును ఎక్కడ నుంచి తెచ్చి మరమ్మతులు చేయించాలని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వారు ఆలోచనలో పడిపోయారు. దాతలు ముందుకొచ్చి సహాయం చేస్తే తప్ప కార్యాలయం ఒక రూపుకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. కాగా, ఈ శిథిల భవంతికి నగరవాసి పట్నం దుర్గేష్‌బాబు రూ.1,16,116 విరాళాన్ని ప్రకటించి పనులు చేయిస్తున్నారు.

మన నెత్తిమీద రూ.13 లక్షల కోట్ల అప్పు

● చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : పొంగూరు నారాయణ


ఇంటింటి ప్రచారంలో నారాయణ

నెల్లూరు (వైద్యం), జనవరి 9 : వైసీపీ ప్రభుత్వం మన నెత్తిమీద రూ.13 లక్షల కోట్ల అప్పుపెట్టిందని మాజీమంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణ అన్నారు. మంగళవారం 10వ డివిజన్‌లోని ఉస్మాన్‌సాహెబ్‌పేటలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు యువత, టీడీపీ నేతలతో కలిసి ఇంటింటికి తిరిగి పార్టీ ప్రచారం చేపట్టారు. జగన్ ఒక చేత్తో ప్రజలకు ఇచ్చి రెండో చేత్తో అంతకు పదింతలు లాక్కుంటున్నాడని విమర్శించారు. రాష్ట్రంలో ఎలాంటి పరిశ్రమలు కొత్తగా రాలేదని, పర్యాటకాభివృద్ధి కూడా లేదని ఆరోపించారు. సంపద సృష్టించే చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు తిరుమల నాయుడు, టీడీపీ నాయకులు కాకర్ల వెంకట్రావు, మల్లికార్జునరావు, శ్రీనివాసులు యాదవ్, నరేష్, రవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలయ్య సైన్యం ప్రచారం

● పాల్గొన్న నారాయణ సతీమణి రమాదేవి

నెల్లూరు (వైద్యం), జనవరి 9 : నందమూరి బాలయ్య సైన్యం ఆధ్వర్యంలో మాజీ మంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి నగరంలోని 16వ డివిజన్‌లో మంగళవారం పర్యటించారు. ఇంటింటికి తిరిగి పార్టీ ప్రచారాన్ని చేపట్టారు. బాలయ్య సైన్యం జిల్లా అధ్యక్షుడు రవి మాట్లాడుతూ నారాయణ అంటే అభివృద్ధికి చిరునామా అన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు పసుపులేటి మల్లికార్జున, కుంచాల శ్రీనివాసులు, పోతయ్య, పూజారి శ్రీనివాసులు రెడ్డి, శ్రీహరి నాయుడు, నజీర్‌బాషా, సాయిరాం, ఆనంద్ బాబు, మురళి తదితరులు పాల్గొన్నారు.


నారాయణ సతీమణి రమాదేవితో బాలయ్య సైన్యం

జనసేన,టీడీపీ అభ్యర్థిని గెలిపించండి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 9: త్వరలో జరగబోయే ఎన్నికల్లో జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేలా ఆశీర్వదించాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి ప్రజలను కోరారు. జనం కోసం జనసేన కార్యక్రమాన్ని నగరంలోని 54వ డివిజన్ వెంకటేశ్వరపురం, జనార్దన్‌రెడ్డి కాలనీలో మంగళవారం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రజలు చెబుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, నాయకులు షేక్ ఆలియా, జహీర్, సుల్తాన్‌బాషా, అజయ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న మనుక్రాంత్‌రెడ్డి

అయోధ్య రాముని అక్షితల వితరణ


అక్షితలు తీసుకువస్తున్న వ్యాన్‌కు జెండాలతో స్వాగతం పలుకుతున్న బాలబాలికలు

నెల్లూరు (విద్య), జనవరి 9 : నగరంలోని సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ, వేద గణపతి ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరామ చంద్రమూర్తి అక్షితల వితరణ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. చంద్రమౌళి నగర్, సావిత్రినగర్‌లోని ప్రతి ఇంటికి అక్షితలను పంపిణీ చేశారు. అయోధ్య శ్రీరాముని ఆశీస్సులు ప్రతి కుటుంబానికి ఉండాలని, ఆ స్వామిని దర్శించుకునే భాగ్యం అందరికీ కలగాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

యోగా క్రీడాకారిణికి అభినందన

నెల్లూరు (విద్య), జనవరి 9 : పుదుచ్చేరిలో జరిగిన అంతర్జాతీయ యోగా పోటీల్లో వేదాయపాళెంకు చెందిన క్రీడాకారిణి జీ కావ్యశ్రీ బంగారు పతకం సాధించడంతో మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ స్రవంతి ఆమెను అభినందించారు. మున్ముందు మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యోగా గురువుల ప్రసన్నకుమార్, రవీంద్ర, పద్మావతి పాల్గొన్నారు.

పురోహితులకు సన్మానం

నెల్లూరు (వెంకటేశ్వరపురం), జనవరి 9 : సంక్రాంతి పండుగ సందర్భంగా వెంకటేశ్వరపురంలో మంగళవారం పురోహితులను సన్మానించారు. స్థానిక వికలాంగుల ఐక్య సంఘం ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు సనావుల్లా మాట్లాడుతూ తెలుగు సంప్రదాయాలను గుర్తుచేసే సంక్రాంతి పండుగ సందర్భంగా పురోహితులను ఏటా సత్కరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్‌బోర్డు మిత్రమండలి అధ్యక్షుడు ప్రసాద్, కో ఆప్షన్ సభ్యుడు జమీర్, రవి పాల్గొన్నారు.


పురోహితులతో దివ్యాంగుల ఐక్య సంఘం సభ్యులు

ముందస్తు సంక్రాంతి సంబరాలు


టీపీ గూడూరు : భోగి మంటలు వేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


పొదలకూరు : సంప్రదాయ దుస్తుల్లో చిన్నారులు

తోటపల్లిగూడూరు, జనవరి 9: మండలంలోని సౌత్ ఆములూరు మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచి సరళకుమారి మాట్లాడుతూ హిందూ సంస్కృతిని, సాంప్రదాయాలను విద్యార్థులకు తెలియచేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు షేక్ అహ్మద్‌బాషా, పాఠశాల వైస్ చైర్మన్ వీ.గిరిజకుమారి, ఉపాధ్యాయులు ఎం మురళి, కే.వసంతలక్ష్మి, కే హెప్సీ విద్యుల్లత, బీ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు : పట్టణంలోని అమరావతి, నాగార్జున పాఠశాలల్లో మంగళవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పాఠశాల ఆవరణంలో భోగి మంటలు వేసి, విద్యార్థులకు భోగి పండ్లు పోసి ఉపాధ్యాయులు దీవించారు. కరస్పాండెంట్ కె.సురేష్ మాట్లాడుతూ సంక్రాంతి అంటే గ్రామాల్లో కోలాటాలు, గొబ్బెమ్మలు, హరిదాసు గీతాలు, గంగిరెద్దులు లాంటి జానపద కళారూపాలు కనిపిస్తు న్నాయన్నారు. విద్యార్థులు వేసిన వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం ఉపాధ్యాయులు భోగి, సంక్రాంతి, కనుమ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు, గ్లోబల్ పాఠశాలలో సంప్రదాయాలకు అనుగుణంగా కట్టుబొట్టుతో విద్యార్థిని, విద్యార్థులు హరిదాసు, వేషధారణలు, నృత్యాలు అలరించారు. ముందుగా రంగురంగుల ముగ్గులు తీర్చి భోగి మంటలు వేశారు. ఈ కార్యక్రమంలో స్కూలు కరస్పాండెంట్ షేక్ గౌసియాబేగం పాల్గొని సంక్రాంతి విశేషాలను వివరించారు.

నేడు డయల్ యువర్ డీఎం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 9: ఆర్టీసీ నెల్లూరు ఒకటో డిపో పరిధిలోని ప్రయాణి కులకు మెరుగైన సేవలు అందించేందుకు బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆ డిపో మేనేజర్ మురళీ కృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికులు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 9959885641 నెంబరుకు ఫోన్ చేసి సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

సైకిల్ గుర్తుకు ఓటేయండి

● ఎమ్మెల్యే కోటంరెడ్డి కుటుంబీకులు



నెల్లూరు రూరల్, జనవరి 9 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరు సైకిల్ గుర్తుకు ఓటేసి చంద్రబాబును సీఎం చేయాలని రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కుటుంబీకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మంగళవారం కనుపర్తిపాడులో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ పేరిట కరపత్రాలను అందచేశారు. రాష్ట్రంలో ప్రజారంజక పాలన రావాలంటే టీడీపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి సతీమణి సుజిత, కుమార్తెలు హైందవి, వైష్ణవిలు పాల్గొన్నారు.

దివ్యాంగుల కేంద్రంలో వైద్య శిబిరం

నెల్లూరు (వైద్యం), జనవరి 9 : నెల్లూరు రెడ్‌క్రాస్ దివ్యాంగుల కేంద్రంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. యామిని న్యూరోకేర్ సెంటర్ నిర్వాహకురాలు ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ యామిని పాల్గొని చిన్నారులకు వైద్య సేవలు అందించారు. రెడ్‌క్రాస్ దివ్యాంగుల కేంద్రం సలహాదారు దాసరి రాజేంద్రప్రసాద్, మేనేజింగ్ కమిటీ సభ్యుడు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ ప్రతిష్ఠ ప్రదర్శనకు అనుమతివ్వండి




నెల్లూరు (స్టోన్ హౌస్‌పేట) : ఈ నెల 22వ తేదీ అయోధ్యలో జరిగే రామాలయ ప్రారంభోత్సవం, శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఎల్ఈడీ స్ర్కీన్‌పై ప్రదర్శించేందుకు అనుమతి ఇవ్వాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ కోరారు. ఈ మేరకు మంగళవారం దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ శ్రీనివాసరావుకు సిబ్బంది ద్వారా వినతి పత్రం అందించారు. ఉదయగిరిలోని రంగనాయకుల స్వామి ఆలయ ప్రాంగణంలో 22వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎల్ఈడీ స్ర్కీన్ ద్వారా రాముల వారి ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తులు వీక్షించేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం	9985411424
నెల్లూరు ఏసీవో	9542727676
నెల్లూరు సిటీ	8179815202
నెల్లూరు రూరల్	8885688410
కోవూరు	8008894200



జిల్లా అధికారులపై ఈసీ సీరియస్

- ఏపీలో అత్యధికంగా చంద్రగిరి, తిరుపతి నుంచే ఫిర్యాదులు

ఇన్ని ఫిర్యాదులు వస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?

ధోరణి మార్చుకోకుంటే తీవ్ర చర్యలు

తిరుపతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో మంగళవారం ఓటర్ల జాబితా సవరణలపై సమీక్షించిన కేంద్ర ఎన్నికల సంఘం జిల్లా అధికారులపై సీరియస్ అయింది. విపరీతంగా ఫిర్యాదులు వస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీసింది. ధోరణి మార్చుకోకుంటే తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించింది. విజయవాడలో మంగళవారం రాష్ట్రంలో జిల్లాల వారీగా ముఖ్య అధికారులతో ఎన్నికల సంఘం కమిషనర్లు సమీక్ష నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు తిరుపతి జిల్లాపైనే ప్రధానంగా ఎన్నికల సంఘం దృష్టి సారించింది. రాష్ట్రంలోనే అత్యధికంగా తిరుపతి జిల్లా నుంచే ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని, దీనికి కారణాలేమిటని ప్రశ్నించింది. చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాల నుంచీ విపరీతంగా ఫిర్యాదులు అందుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీసింది. అనర్హుల ఓట్లు తొలగించాలని ప్రతిపక్ష పార్టీల నుంచీ అభ్యంతరాలు అందితే ఎందుకు పరిశీలించడం లేదని ప్రశ్నించింది. అభ్యంతరాలలో పేర్కొన్న పేర్లు డ్రాఫ్ట్ జాబితాలో మళ్ళీ కొనసాగుతుండడం పట్ల విస్మయం వ్యక్తం చేసింది. ఇదే ధోరణితో వుంటే ఎన్నికల షెడ్యూలు విడుదలయ్యాక తీవ్ర చర్యలు వుంటాయని హెచ్చరించింది. చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాల్లో వచ్చిన ఫిర్యాదులు, అభ్యంతరాల మీద గడువు లోగా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి తదితర నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాలో అవకతవకల గురించి ఆయా నియోజకవర్గాల నుంచీ అందిన అసంఖ్యాక ఫిర్యాదులతో గత నెలలో సమీక్షించినపుడే ఎన్నికల సంఘం జిల్లా అధికార యంత్రాంగాన్ని స్పష్టంగా హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఇపుడు ఏకంగా టీడీపీ, జనసేన పార్టీల అధ్యక్షులు చంద్రబాబు , పవన్ కళ్యాణ్‌లే నేరుగా ఫిర్యాదు చేయడంతో కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించినట్టు సమాచారం. దానికి తోడు ఎన్నికల కమిషన్ రాష్ట్రానికి వచ్చిన సమయంలోనే చంద్రగిరి టీడీపీ ఇంచార్జి పులివర్తి నానీ ఓటర్ల నమోదులో అక్రమాలపై ఆమరణ నిరాహార దీక్షకు దిగడం, పోలీసులు అడ్డుకోవడంతో పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు యత్నించడం వంటి ఘటనలు కమిషన్ దృష్టికి వెళ్ళాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం మంగళవారం జరిపిన సమీక్షలో అధిక సమయం తిరుపతి జిల్లాకే కేటాయించి లోతుగా వివరాలు రాబట్టినట్టు సమాచారం. ఆ క్రమంలో జిల్లా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. గడువులోగా చంద్రగిరి, తిరుపతి సెగ్మెంట్లలో అందిన అభ్యంతరాలు, ఫిర్యాదులపై జిల్లా యంత్రాంగం ఏ మేరకు చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సి వుంది. ఒకవేళ చర్యలు తీసుకోవడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తే మాత్రం తీవ్ర మూల్యం చెల్లించాల్సి వుంటుందని జిల్లా ఉద్యోగ, అధికార వర్గాలు భావిస్తున్నాయి.

దొంగ ఓట్లు తొలగించరెందుకు?

ఆధార్‌తో అనుసంధానం చేసి గందరగోళానికి తెరదించండి

తిరుపతిలో టీడీపీ, జనసేన ఆందోళన



తిరుపతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నియోజకవర్గంలో దొంగ ఓట్లను తొలగించాలని ఆధారాలతో సహా ఎన్నికల అధికారులకు పలుసార్లు ఫిర్యాదు చేసినా ఫలితంలేకుండా పోతోందని టీడీపీ, జనసేన నాయకులు మండిపడ్డారు. దొంగ ఓట్ల తొలగింపులో మౌనం దాల్చుతున్న అధికారుల తీరును నిరసిస్తూ మంగళవారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట టీడీపీ, జనసేన నాయకులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ ఛైర్మన్ నరసింహ యాదవ్, నియోజకవర్గ పరిశీలకుడు సురేంద్ర కుమార్ మాట్లాడుతూ.. ముసాయిదా ఓటరు జాబితాలో గందరగోళంగా మార్పులు, చేర్పులను చేశారన్నారు. చనిపోయినవారి, నగరం నుంచి వెళ్లిపోయినవారి పేర్లను బీఎల్వోల సమక్షంలో గుర్తించి ఫిర్యాదు చేసినప్పటికీ ఇంకా వారు ఓటర్లుగా కనిపిస్తున్నారన్నారు. వైసీపీ దొంగ ఓట్లను నమ్ముకుని ఎన్నికలకు వెళుతోందని ఆరోపించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక తిరుపతిలో జరిగిన కార్పొరేషన్, ఎంపీ ఉప ఎన్నిక, టౌన్ బ్యాంకు ఎన్నికలను అపహాస్యం చేశారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ దొంగ ఓట్లు వేశారని, అయితే విద్యావంతులు తగిన బుద్ధి చెప్పారని గుర్తుచేశారు. ఓటరు కార్డుకు ఆధార్ కార్డుతో అనుసంధానం చేసి.. గందరగోళానికి తెరదించాలని కోరారు. తుది ముసాయిదా జాబితాలో దొంగ ఓట్లకు అవకాశం లేకుండా చూడాల్సిన బాధ్యత డీఆర్వో, ఈఆర్వో, ఏఈఆర్వోలపై ఉందని చెప్పారు. లేకుంటే న్యాయపరంగా పోరాడాల్సి వస్తుందని హెచ్చరించారు. సుగుణమ్మ నివాసం నుంచి ర్యాలీగా వచ్చి మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. దొంగ ఓట్లను తొలగించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డికి వినతిపత్రం అందజేశారు.టీడీపీ నేతలు బీఎల్ సంజయ్, ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాస్, బుల్లెట్ రమణ, దంపూరి భాస్కర్, చినబాబు, మహేష్ యాదవ్, ఊట్ల సురేంద్ర నాయుడు, సింగంశెట్టి సుబ్బరామయ్య, సూరా సుధాకర రెడ్డి, జయరామ రెడ్డి, రుద్రకోటి సదాశివం, బ్యాంకు శాంతమ్మ, కంకణాల రజనీకాంత్ నాయుడు, ఆముదాల తులసి, ఇనుగొండ సుబ్రహ్మణ్యం, తిరుమల కేశవులు, మన్నెం శ్రీనివాసులు, ఆనంద్ యాదవ్, హేమంత్ రాయల్, కరాటే చంద్ర, రఘు, ప్రకాష్, ధర్మారెడ్డి, విశ్వనాథం, రాజారాం, కేవీ రమణ, రేవతి, లత, జనసేన నాయకులు సుభాషిణి, రాజేష్ ఆచారి, చందన, దుర్గ, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

సుజల సమాధి!



నిరుపయోగమైన ఏటీఎం తరహాలో శుద్ధ జలం సరఫరా చేసే యంత్రం

శ్రీకాళహస్తి, జనవరి 9 : ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం గత టీడీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సుజల పథకం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. శ్రీకాళహస్తి పట్టణంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ శుద్ధ జల యంత్రాలు వ్యర్థంగా మారాయి. శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలో 35వార్డులున్నాయి. గత ప్రభుత్వ హయాంలో అమృత్ పథకానికి శ్రీకాళహస్తిని ఎంపిక చేశారు. పట్టణవ్యాప్తంగా ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసి రెండు రూపాయల నగదుతో 20 లీటర్ల శుద్ధ జలం సరఫరాకు శ్రీకారం చుట్టారు. దీంతో పేదలందరికీ ఎంతో ప్రయోజనం చేకూరింది. 2018వ సంవత్సరంలో స్మార్ట్ విధానంతో సుజల పథకం చేపట్టారు. ఇందుకోసం రూ.10లక్షల రూపాయలు వెచ్చించారు.పట్టణంలోని ఐదు వార్డులకు శుద్ధజలం సరఫరా చేసేందుకు భూగర్భ పైప్‌లైన్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. ఈ పైప్ లైన్ పొడవునా అక్కడక్కడా స్మార్ట్ కుళాయిలను ఏర్పాటు చేశారు. వినియోగదారులు ప్రతి సారీ నగదు చెల్లించాల్సిన అవసరం లేకుండా పురపాలక సంఘంలో డబ్బులు చెల్లించి ఏటీఎం తరహాలో కార్డు పొందవచ్చు.ఆ కార్డు నుంచి ఒక్కో క్యాన్‌కు రెండు రూపాయలు చొప్పున నగదు జమవుతుంది. అలాగే 24గంటల్లో ఎప్పుడైనా శుద్ధ జలం అందుకునే అవకాశం ఉంటుంది. దీనిపై ప్రజల నుంచి మంచి స్పందన కూడా వచ్చింది.ఇంతలో 2019వ సంవత్సరం ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారింది. మిగిలిన వార్డులకు సుజల పథకాన్ని విస్తరించే పని జరగలేదు. ఆరంభంలో అధికారులు ఈ పథకానికి పేరు మార్చి వైయస్సార్ సుజల స్టిక్కర్లను అంటించారు. ఆ తర్వాత క్రమంగా సుజల పథకం జనానికి దూరమైంది. పైప్‌లైన్ విధానం కూడా గాలికి పోయింది. టీడీపీ కార్యాలయం వెనుక వాటర్ ట్యాంక్ వద్ద వందల సంఖ్యలో పేదల నివాస గృహాలున్నాయి.వారంతా అక్కడున్న స్మార్ట్ యంత్రం ద్వారా తాగునీరు తీసుకునేవారు.చాలా కాలం నుంచి అక్కడ శుద్ధజలం కరువైంది. స్మార్ట్ యంత్రం నిరుపయోగం కావడంతో వ్యర్థాలు దాని చుట్టూ వేసేస్తున్నారు.ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించి ప్రజాధనం వృధా కాకుండా జనానికి మేలు చేకూర్చే పనులను పునరుద్ధరించాల్సి ఉంది.

21కేజీల గంజాయి పట్టివేత



గంజాయి నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సెబ్ డీఎస్పీ రమేష్

- నలుగురు బెంగళూరు యువకుల అరెస్టు

నాయుడుపేట టౌన్, జనవరి 9 : అక్రమంగా తరలిస్తున్న 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ డీఎస్పీ రమేష్ తెలిపారు. నాయుడుపేట సెబ్ కార్యాలయంలో మంగళవారం పట్టుబడ్డ నిందితుల వివరాలను ఆయన వెల్లడించారు. సెబ్ సీఐ ప్రసాద్ వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నలుగురు యువకులు అనుమానాస్పదంగా కన్పించడంతో వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు.వారి బ్యాగుల్లో 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు బెంగళూరుకు చెందిన కిరణ్, విక్రమ్, గౌడ్‌పాటిల్, శ్యామ్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. పట్టుబడ్డ గంజాయి విలువ 3.15 లక్షలు ఉంటుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ మృతి



ప్రమాదంలో దెబ్బతిన్న టిప్పర్

తడ, జనవరి 9: అతి వేగంతో వచ్చిన ఓ లారీ ముందు ఉన్న లారీలను ఢీకొట్టిన ఘటనలో లారీ క్లీనర్ మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలపాలయ్యాడు. చెన్నై తండయార్‌పేట ఇండియన్ ఆయిల్ కంపెనీకి చెందిన ట్యాంకర్ లారీ లోడ్‌తో నాగపూర్‌కు సోమవారం అర్ధరాత్రి బయలుదేరింది. సెల్వం లారీని నడుపుతుండగా ఎన్. కృష్ణన్ క్లీనర్‌గా ఉన్నాడు. మార్గ మధ్యలో భీములవారిపాళెం చెక్‌పోస్టుకు సమీపం మత్స్యకార సముదాయ భవనం వద్దకు ఈ లారీ అతివేగంగా వెళ్తూ ముందు వెళ్తున్న టిప్పర్ లారీని వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో టిప్పర్ లారీ దాని ముందు వెళ్తున్న ఐసర్‌లారీని ఢీకొనగా, అది వెళ్లి దాని ముందువెళ్తున్న మరో లారీని ఒకదానికొకటి ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో ట్యాంకర్ క్లీనర్ వైపు ముందుభాగం నుజ్జునుజ్జుకాగా క్లీనర్ ఎన్.కృష్ణన్(53) అందులో ఇరుక్కొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహం సైతం ఛిద్రమైపోయింది. అలాగే ఐసర్‌లారీ డ్రైవర్ గౌస్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదంతో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని మృతదేహంను స్వాధీనం చేసుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సులో రూ.19లక్షల పట్టివేత



పట్టుబడిన నగదు వివరాలు చెబుతున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

చిల్లకూరు, జనవరి 9:చిల్లకూరు మండలంలోని బూదనం టోల్‌ప్లాజా వద్ద బస్సులో తరలిస్తున్న రూ.19లక్షల నగదును పట్టుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ మంగళవారం వేకువ జామున బూదనం టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. తిరుపతి వెళుతున్న బస్సులో విజయవాడకు చెందిన అరవింద్ కృష్ణ ఎలాంటి పత్రాలు లేకుండా రూ.19లక్షలను తీసుకువెళుతుండగా గుర్తించి నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. సీఐ వేణుగోపాలరెడ్డి, ఎస్ఐ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన అంగన్వాడీలు

- తిరుపతి సహా పలు చోట్ల జైల్ భరో నిర్వహణ
- రిలే దీక్షలు, ధర్నాలు, మానవహారాలు, రాస్తారోకోల హోరు
- పలుచోట్ల మద్దతిచ్చిన కార్మిక సంఘాల నేతల అరెస్టు



నాయుడుపేటలో సీఐటీయూ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



తిరుపతిలో వామపక్షాలతో కలిసి ప్రదర్శన

తిరుపతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నిరవధిక సమ్మె చేపట్టిన అంగన్వాడీ ఉద్యోగులు మంగళవారం జిల్లావ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు, ధర్నాలు, ర్యాలీలు, మానవహారాలు, రాస్తారోకోలతో హోరెత్తించారు. తిరుపతి సహా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాలున్న కేంద్రాల్లో జైల్ భరో కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్వాడీ మహిళలకు మద్దతుగా పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులను పలుచోట్ల పోలీసులు అరెస్టు చేశారు. తిరుపతిలో పాత మున్సిపల్ కార్యాలయం వద్ద శిబిరం నుంచీ అంగన్వాడీ మహిళలతో పాటు సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులు, మున్సిపల్ వర్కర్లు సైతం జైల్ భరో పేరిట భారీ ప్రదర్శన నిర్వహించారు. ర్యాలీ నాలుగుకాళ్ళ మండపం చేరగానే పెద్ద సంఖ్యలో మొహరించిన పోలీసులు ముందుకు పోకుండా అడ్డుకున్నారు.ఆగ్రహించిన ఆందోళనకారులు అక్కడే బైఠాయించారు. అనంతరం పోలీసులు వీరిని అదుపులోకి తీసుకుని ఈస్ట్ పోలీస్ స్టేషన్‌కు తరలించగా స్టేషన్ ప్రాంగణంలో బైఠాయించి పెద్దపెట్టున ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జైల్‌భరో నిర్వహించిన ఉద్యోగులకు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ సంఘాల నాయకులు మద్దతు ప్రకటించి కార్యక్రమంలో పాల్గొన్నారు. గూడూరులో గ్రామసేవకుల భవనం వద్ద నుంచీ టవర్ క్లాక్ కూడలి వరకూ అంగన్వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు.ఆ కూడలిలో మానవహారం నిర్మించారు. అనంతరం రాస్తారోకోకు దిగారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి మహిళలకు మద్దతుగా పాల్గొన్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులను అరెస్టు చేశారు. వెంకటగిరిలో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం నుంచీ ఉద్యోగులు రాపూరు క్రాస్ రోడ్డు వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడే మానవహారం నిర్మించి తర్వాత రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు ఆందోళనకు నాయకత్వం వహించిన సీఐటీయూ నాయకులను అరెస్టు చేశారు. కోట ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం నుంచీ అంగన్వాడీ మహిళలు బజారు వీధి మీదుగా గాంధీ బొమ్మ కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు.అనంతరం అక్కడే మానవహారం ఏర్పరిచారు. ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య వున్నారని సమాచారం అందడంతో అక్కడికి వెళుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. నాయుడుపేటలో జైల్ భరో కార్యక్రమం చేపట్టిన అంగన్వాడీ కార్యకర్తలు పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై బైఠాయించడంతో వారికి మద్దతుగా పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. సత్యవేడులో గాంధీ విగ్రహం వద్ద రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టిన అంగన్వాడీలు గంటకు పైగా నినాదాలు చేస్తూ ఆందోళన కొనసాగించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. పుత్తూరులో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం నుంచీ అంబేద్కర్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించిన ఉద్యోగులు అనంతరం ఆ సర్కిల్‌లో ధర్నాకు దిగారు. పిచ్చాటూరులో పోలీస్ స్టేషన్ ఎదుట ఉద్యోగులు జైల్ భరో నిర్వహించారు. చంద్రగిరి, సూళ్ళూరుపేట, శ్రీకాళహస్తి తదితర చోట్ల కూడా అంగన్వాడీ ఉద్యోగులు జైల్‌భరో కార్యక్రమం నిర్వహించారు.



తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో బైఠాయించిన అంగన్వాడీలు

ఆర్ఏఆర్ఎస్‌కి అవార్డు



సర్టిఫికెట్ అందుకుంటున్న ఏడీఆర్ రమణ, శాస్త్రవేత్తలు

తిరుపతి(విద్య), జనవరి 9: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయవర్సిటీ పరిధిలో తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్ఏఆర్ఎస్) వరుసగా మూడో ఏడాదీ ఉత్తమ పరిశోధనా స్థానం అవార్డును కైవసం చేసుకుంది. గుంటూరులోని వర్సిటీ కేంద్రంగా మంగళవారం నిర్వహించిన 53వ పరిశోధనా, విస్తరణ సలహామండలి సమావేశంలో వీసీ ప్రొఫెసర్ శారదా జయలక్ష్మి, అగ్రిమిషన్ వైస్ ఛైర్మన్ నాగిరెడ్డి, రాష్ట్ర మార్కెటింగ్ సలహాదారులు బి.బ్రహ్మానందరెడ్డి చేతులమీదుగా బెస్ట్ రీసెర్చ్ స్టేషన్ సర్టిఫికెట్‌ను ఏడీఆర్ డాక్టర్ సి.రమణ అందుకున్నట్లు ప్రకటించారు. రమణ మాట్లాడుతూ.. మూడో ఏడాదీ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. శాస్త్రవేత్తలు, ఉద్యోగుల సమన్వయంతో సాధించామని తెలిపారు. వర్సిటీ అధికారులు, ఈసీ సభ్యులు, ప్రధానశాస్త్రవేత్తలు డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ పి.బాలహుస్సేన్‌రెడ్డి, డాక్టర్ నాగమాధురి, డాక్టర్ టి.ప్రతిమ, డాక్టర్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూకు నైలెట్ కేంద్రం మంజూరు

రూ.8.5 కోట్ల పరిశోధన ప్రాజెక్టుకు పచ్చ జెండా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 9: ఎస్వీ యూనివర్సిటీకి రూ.8.5 కోట్ల పరిశోధన ప్రాజెక్టు మంజూరైంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (నైలెట్) కేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రితోపాటు సంబంధిత ఉన్నతాధికారులతో ఎంపీ గురుమూర్తి సంప్రదించి ఈ కేంద్రం మంజూరుకు కృషి చేశారు. యూనివర్సిటీలో నైలెట్ కేంద్రం ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను ఓ కమిటీని అధ్యయనం చేసింది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా కేంద్రం పచ్చ జెండా ఊపింది. చెన్నైలోని నైలెట్ ఈ ప్రాజెక్టును నిర్వహించేలా కేంద్రం మార్గదర్శకాలను రూపొందించినట్టు తెలుస్తోంది. ఈ కేంద్రం రాకతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే పలు కోర్సులను నిర్వహించే అవకాశం ఏర్పడుతుంది. పైగా తైవాన్, జపాన్, కొరియా, చైనా వంటి దేశాల్లోని పలు సంస్థలతో ఒప్పందాలను కుదుర్చుకుని కోర్సుల నిర్వహణ, ఉపాధి కల్పన అంశాల్లో పరస్పర సహకారంతో తిరుపతి ప్రాంత విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు పొందే అవకాశం ఉంటుంది. కేంద్రం ఏర్పాటైన మూడేళ్ల నుంచి ఏటా వెయ్యి మంది విద్యార్థులు శిక్షణ పూర్తి చేసుకుని, వెలుపలకు రానున్నారు. ఈ కేంద్రం మంజూరుకు సహకరించిన సీఎం జగన్‌కు, కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఎంపీ గురుమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

అప్పుల్లో ఫస్ట్... అభివృద్ధిలో లాస్ట్: నెలవల



కరపత్రాలు అందజేస్తున్న మాజీ ఎంపీ నెలవల

తడ, జనవరి 9: ఆంధ్రప్రదేశ్ అప్పుల్లో మొదటిస్థానంలో ఉండగా, అభివృద్ధిలో చివరిస్థానంలో నిలిపిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఎద్దేవా చేశారు. మంగళవారం తడలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో రూ.12 లక్షల కోట్ల అప్పులు చేశారని తెలిపారు. సంక్షేమ పథకాల కింద రూ.2 లక్షల కోట్లు ప్రజలకు పంచామని చెబుతున్న ప్రభుత్వం, మిగిలిన రూ.10లక్షల కోట్లు ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని దివాళా తీయించిన జగన్‌కు మరోసారి అధికారం అప్పగిస్తే అధోగతి పాలవడం ఖాయమన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొమ్మన శ్రీధర్, నాయకులు కామిరెడ్డి మురళీరెడ్డి, సెల్వం, నీలకంఠం, శివాజీ, రామమూర్తి, రమేష్ పాల్గొన్నారు.

కోట ఆస్పత్రి అదనపు భవనం ప్రారంభం



ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

కోట, జనవరి 9: కోటలోని ప్రభుతాస్పత్రి ప్రాంగణంలో నిర్మించిన అదనపు భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు లాంఛనంగా ప్రారంభించారు. రూ.1.93 కోట్ల నాబార్డ్ నిధులతో ఆస్పత్రి అదనపు భవన నిర్మాణాన్ని ఆరు నెలల క్రితమే పూర్తయింది. అప్పట్లోనే భవనాన్ని ప్రారంభించాలనుకున్నా ఆగిపోయింది. దీంతో ఆస్పత్రి సిబ్బంది కొత్తగా నిర్మించిన భవనంలోకి చేరిపోయి విధులు నిర్వహిస్తున్నారు. అక్కడే ఆపరేషన్లు, రోగులకు చికిత్స అందిస్తున్నారు. మంగవారం ఎమ్మెల్యే వరప్రసాద్ విచ్చేసి అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో లాంఛనంగా భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దారు పద్మావతి, ఎంపీడీవో భవానీ, ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ రూప, డాక్టర్ జీమ్‌ప్రియరావు, ఎంపీటీసీ మోబిన్‌బాషా, గురుస్వామి, ప్రసాద్, సర్పంచు వెంకటరమణమ్మ, వైసీపీ మండల కన్వీనర్ సంపత్‌కుమార్‌రెడ్డి, యువజన విభాగం నాయకులు సాయిప్రసాద్‌రెడ్డి, హరిచంద్రారెడ్డి, ప్రసాద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ రైతులకు అవగాహన సదస్సు



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

గూడూరు, జనవరి 9: మండలంలోని పారిచెర్ల గ్రామంలో మంగళవారం నెల్లూరుకు చెందిన వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో నిమ్మ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మ పీడీ సత్యవాణి మాట్లాడుతూ నిమ్మచెట్లుకు హైడ్రోజెల్ వినియోగించడం వల్ల మొక్కలకు తక్కువ నీటి తడులు అవసరమవుతాయన్నారు. కరువు సమయంలో నీటి ఎద్దడిని మొక్కలు తట్టుకుంటాయన్నారు. అనంతరం రైతులకు హైడ్రోజెల్‌ను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో డీపీడీ శివన్నారాయణ, కార్తీక్, శివ, రైతులు పాల్గొన్నారు.

సూక్ష్మధాతు లోపాల నివారణపై అవగాహన

వెంకటగిరి, జూన్ 9: వెంకటగిరి మండలంలోని నిమ్మ, చీని పరిశోధనా కేంద్రంలో మంగళవారం నిమ్మ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర అధిపతి మధుమతి ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు నిమ్మలో సూక్ష్మధాతు లోపాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. సూక్ష్మధాతు మిశ్రమం తయారు చేసే విధానం, తయారు చేసిన మిశ్రమాన్ని నిమ్మ చెట్లపై పిచికారీ చేయడంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యాన కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయండి



రైల్వేస్టేషన్ వద్ద రిలే దీక్షచేస్తున్న రైల్వే ఉద్యోగులు

గూడూరు, జనవరి 9: కేంద్ర ప్రభుత్వం వెంటనే నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద సంఘ్ ఆధ్వర్యంలో రైల్వే ఉద్యోగులు రిలే నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2004 తర్వాత రైల్వేశాఖలో చేరిన ఉద్యోగులకు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలన్నారు. ఎన్‌పీఎస్ వలన ఉద్యోగులకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. రైల్వేశాఖను ప్రైవేటీకరించడాన్ని మానుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాన్ని చెల్లించాలన్నారు. రైల్వేశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాగరాజు, పీవీరావు, కార్తీక్, పెంచలయ్య, వెంకటేశ్వర్లు, కోటి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన

పెళ్లకూరు, జనవరి 9: ఈవీఎంల వినియోగంపై పెళ్లకూరు సచివాలయంలో మంగళవారం అవగాహన కార్యక్రమం తహసీల్దార్ రామయ్య పాల్గొని ఈవీఎంల వినియోగం, వాటి పనితీరు గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ సంతోషీబాయి తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంల గురించి ప్రజలకు వివరిస్తున్న తహసీల్దార్ రామయ్య

రెండు మోటారు సైకిళ్ల ఢీ
ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

నాయుడుపేట టౌన్, జనవరి 9: నాయుడుపేట - మేనకూరు సెజ్ సమీపంలో రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఓజిలి మండలం మనవాలి గ్రామానికి చెందిన సుబ్బరామయ్య, మల్లికార్జున్ మోటారు సైకిల్‌పై మేనకూరు నుంచి మంగళవారం వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్బరామయ్య(64) మృతి చెందగా, మల్లికార్జున్, పెంచలయ్యకు గాయాలయ్యాయి. సుబ్బరామయ్య మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న స్పోర్ట్స్ మీట్

వెంకటగిరిటౌన్, జనవరి 9: మండల పరిధిలోని బెటాలియన్‌లో స్పోర్ట్స్ మీట్ కొనసాగుతోంది. మంగళవారం జరిగిన కార్యక్రమంలో కర్నూలు రేంజీ డీఐజీ-3 సీహెచ్ వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పోలీసులకు 100 మీటర్లు, 400మీటర్లు రిలే, కబడ్డీ, షటిల్, మ్యూజికల్ చైర్స్ చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కమాండెంట్ ప్రకాష్, అసిస్టెంట్ కమాండెంట్ ఎంఎల్ మనోహర్, ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు గడువు పొడిగింపు

నాయుడుపేట, జనవరి 9: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి జనవరి 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కళాశాల అధ్యయన కేంద్ర కోఆర్డినేటర్ జి. వెంకటరామిరెడ్డి మంగళవారం తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

కోట, జనవరి 9: విధి నిర్వహణలో వీవోఏలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఏపీఎం రత్నయ్య హెచ్చరించారు. కోటలోని వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో మంగళవారం వీవోఏలకు లక్‌పత్ దిది యాప్‌పై శిక్షణ జరిగింది. ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని అందులో నుంచి వచ్చే కేంద్ర ప్రభుత్వ పథకాలను పొదుపు సంఘాలకు వివరించాలన్నారు. సమావేశంలో స్త్రీనిధి మేనేజర్ జయకర్‌బాబు, సీసీలు శ్రీకాంత్, కృష్ణమ్మ, భాస్కర్, ప్రసాద్, శంకర్, కృష్ణ పాల్గొన్నారు.

ఎస్మా చట్టాన్ని ఉపసంహరించుకోండి



నాయుడుపేటలో రోడ్డుపై బైఠాయించిన అంగన్వాడీ, సీఐటీయూ నాయకులు - కోట పట్టణంలో ర్యాలీ

గూడూరు, జనవరి 9: రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలపై ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక గ్రామసేవకుల భవనం వద్ద మంగళవారం అంగన్వాడీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 29వ రోజు కొనసాగింది. దీక్షలో పాల్గొన్న అంగన్‌వాడీలు ప్రదర్శనగా టవర్‌క్లాక్ సెంటర్‌కు చేరుకుని మానవహారం ఏర్పాటు చేసి రాస్తారోకో నిర్వహించారు. వీరికి సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు మద్దతుగా నిలిచారు. వాహనాల రాకపోకలను నిలిపి వేసి సీఎం జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోవడంతో సీఐ హజరత్‌బాబు, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడిచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతుంటే పరిష్కరించకుండా అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని అమలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, బీవీ.రమణయ్య, సురేష్, ప్రసాద్, మణి, శశికుమార్, చంద్రయ్య, గోపీనాథ్, రమణయ్య, శ్రీనివాసులు, ఇంద్రావతి, ప్రభావతి, పెంచలమ్మ, లక్ష్మి, మణికుమారి పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: తమ డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలు ఇన్నాళ్లు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా బెదిరించడం దుర్మార్గమని ఆ యూనియన్ నాయకురాలు హైమావతి అన్నారు. సమ్మెలో భాగంగా మంళవారం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వీరికి సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు.

నాయుడుపేట టౌన్: వైసీపీ పాలనకు చరమగీతం పాడాలని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు చాపల వెంకటేశ్వర్లు అన్నారు. జైలు భరో కార్యక్రమం సందర్భంగా మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు, పారిశుధ్య కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. నాయుడుపేట - పూతలపట్టు రహదారిపై బైఠాయించడంతో దాదాపు కిలోమీటరు మేర వాహనాలు ఆగిపోయాయి. ఎస్ఐ రఘునాథ్ సంఘటనాస్థలాన్ని చేరుకొని సీఐటీయు నాయకులు వెంకటేశ్వర్లు, ముకుంద, అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం పూచికత్తుమీద వారిని విడుదల చేశారు.

వెంకటగిరి: సమస్యల సాధన కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు కలిసి రాపూరు క్రాస్‌రోడ్డు వద్ద మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. పోలీసులు అక్కడికి చేరుకుని కార్మిక నాయకులను అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచికత్తుపై వదిలి పెట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, అంగన్వాడీ యూనియన్ నేతలు మంజుల, సుభాషిణి, శామల, ఉమా, జోతి, ఐఎఫ్‌టీయూ నాయకులు అన్నపూర్ణ, సుప్రియ, గీతావాణి, నిర్మల, మల్లీశ్వరి, నాయకులు భాస్కర్, సుబ్బరాయలు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోట: పట్టణంలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు వినూత్న రీతిలో మంగళవారం నిరసన తెలిపారు. కోటలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నుంచి కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పట్టణంలోని గోపాల్‌రెడ్డి విగ్రహం మీదుగా బజారుసెంటర్‌లోని గాంధీబొమ్మ సెంటర్‌కు చేరుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడ మానవహారం చేసి సీఎం జగన్‌కు మంచి మనస్సు ప్రసాదించాలంటూ దేవుడిని ప్రార్థించారు. అక్కడ నుంచి దీక్షా శిబిరానికి చేరుకొని నిరసన కార్యక్రమాలు చేపట్టారు.



గూడూరు టవర్‌క్లాక్ సెంటర్ వద్ద మానవహారం నిర్వహిస్తున్న అంగన్వాడీలు

సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం విడనాడాలి



గూడూరు మున్సిపల్ కార్యాలయం వద్ద దీక్ష చేస్తున్న పారిశుధ్య కార్మికులు - సూళ్లూరుపేటలో ర్యాలీ

గూడూరు, జనవరి 9: మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని వీడనాడాలని సీఐటీయూ నాయకులు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె మంగళవారం 15వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేసి సమాన పనికి సమాన వేతనం అందజేయాలన్నారు. అందరికీ పనిముట్లు అందజేయాలన్నారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని 15 రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్రప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో శివకుమార్, గోపీనాథ్, బీవీ.రమణయ్య, ప్రసాద్, సురేష్, రమేష్, కోటేశ్వరరావు, ప్రభావతి, సంపూర్ణమ్మ, మురళి, పెంచలప్రసాద్, శాంతివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పారిశుధ్య కార్మికుల సమ్మె కొనసాగుతుందని సీఐటీయూ నాయకుడు లక్ష్మయ్య అన్నారు. కార్మికులు రెండు వారాలుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. విధులకు హాజరవ్వాలని మున్సిపాలిటీ అధికారులు, కొందరు ప్రజాప్రతినిధులు కార్మికులను బెదిరిస్తున్నారని, ఇది సమజసంకాదన్నారు. కార్మికులు కొత్త కోర్కేలేవీ కోరడం లేదని, జగన్ ఇచ్చిన హామీలనే నెరవేర్చమని మాత్రమే అడుగుతున్నారన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి పురవీధుల్లో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సాంబశివయ్య, మనోహర్, అల్లెయ్య, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: సమస్యల సాధన కోసం మున్సిపల్ కార్మికులు ఏఐటీయూ ఆధ్వర్యంలో చేపడుతున్న సమ్మె మంగళవారం 6వ రోజు కొనసాగింది. సమస్యల పరిష్కరించే వరకు ఆందోళన విరమించేది లేదని నాయకులు కల్లూరి జాన్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకులతో కమిషనర్ చర్చలు

గూడూరు, జనవరి 9: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు సీఐటీయూ నాయకులతో చర్చించారు. పారిశుధ్య కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని 15రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నారన్నారు. ఈ నేథప్యంలో పట్టణంలో పారిశుధ్యం ఇబ్బందికరంగా మారిందని, కార్మికులు పనులకు సహకరించాలని కమిషనర్ కోరారు. అయితే సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు సమ్మె చేస్తున్నామని, ప్రభుత్వం హామీలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సంచాలకురాలు లక్ష్మీదేవి

డక్కిలి, జనవరి 9: సేంద్రియ ఎరువుల వినియోగంతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ సంచాలకురాలు లక్ష్మీదేవి అన్నారు. మండలంలోని వెలికల్లు గ్రామంలో విత్తనోత్పత్తి పథకం కింద వరి సాగుచేస్తున్న రైతులకు మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వరిసాగుకు ముందు పొలంలో జనుము, జీలగ, పిల్లిపెసర వంటివి సాగుచేసినట్లయితే సేంద్రియ ఎరువులు పుష్కలంగా లభిస్తాయన్నారు. అలాగే సాధ్యమైనంత వరకు పశువుల పేడ వంటి పచ్చిరొట్ట ఎరువులను వినియోగించాలని సూచించారు. వరినాట్లు వేసేటప్పుడు కాలిబాటలు వదిలితే గాలి, వెలుతురు పారి పిలకలు బాగా వేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఏవోలు వేణుగోపాల్, శ్రీనివాసులు, విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గూడూరు, జనవరి 9: స్థానిక ఏరియా ఆస్పత్రిలో మంగళవారం జేవీవీ ఆధ్వర్యంలో కిషోర్‌రెడ్డి దాతృత్వంతో గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టరు షరీనా, డాక్టరు రాజా, వేగూరు రాజేంద్రప్రసాద్, కిషోర్‌రెడ్డి, చెంచునారాయణ, పురుషోత్తమరావు, శీను, ప్రభాకర్, అశోక్, విజయ్‌బాబు, వెంకటేశ్వర్లు, సాయి తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీల వితరణ

గూడూరు, జనవరి 9: మండలంలోని విందూరు గ్రామంలో మంగళవారం ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో రెండు సిమెంటు బెంచీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ మయూరి శ్యామ్‌యాదవ్ మాట్లాడుతూ గ్రామస్తులకు సౌకర్యవంగా ఉండేలా సిమెంటు బెంచీలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, ప్రభాకర్, రాము, కుమార్, పెంచలయ్య, మోహన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సంజీవయ్య మళ్లీ ఎమ్మెల్యే కావాలి



మోకాళ్లపై నడుస్తూ కనకదుర్గమ్మ గుడి మెట్లకు పూజలు చేస్తున్న దశరథరామిరెడ్డి

నాయుడుపేట, జనవరి 9: సూళ్లూరుపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు కిలివేటి సంజీవయ్య మళ్లీ ఎమ్మెల్యే అవ్వాలంటూ రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ పోలు దశరథరామిరెడ్డి విజయవాడ కనకదుర్గమ్మకు మొక్కుకున్నారు. నాయుడుపేట పట్టణానికి చెందిన దశరథరామిరెడ్డి మంగళవారం విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం మెట్లను మోకాళ్లపై ఎక్కుతూ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోకి వెళ్లి సంజీవయ్య ఎమ్మెల్యేగా, జగన్ సీఎం కావాలని మొక్కుకున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



పోస్టర్ విడుదల చేస్తున్న ఎన్టీఆర్ అభిమానులు

వెంకటగిరిటౌన్, జనవరి 9: జూనియర్ ఎన్టీఆర్ కొత్త సినిమా టీజర్ విడుదల సందర్భంగా వీఎన్ఎఫ్ఏ (వెంకటగిరి నందమూరి ఫ్యాన్స్ అసోషియేషన్) ఆధ్వర్యంలో దేవర మూవీ క్యాలెండర్ విడుదల చేశారు. కార్యక్రమంలో వీఎన్ఎఫ్ఏ అధ్యక్షుడు సుబ్బు యాదవ్, గౌస్ బాషా, ఆచారి, గిరి, శశిధర్, ఈశ్వర్, వెంకటసాయి పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడులు

సూళ్లూరుపేట, జనవరి 9: మండల పరిధిలోని మతకాముడి సమీపంలో కోడి పందేల స్థావరంపై మంగళవారం ట్రైనీ డీఎస్పీ సింధుప్రియ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని, రూ.13,500 నగదు, రెండు బైక్‌లు, రెండు కోళ్ల స్వాధీనం చేసుకొన్నారు.

జయహో బీసీ సభను విజయవంతం చేయండి

పెళ్లకూరు, జనవరి 9: మండలంలోని కొత్తూరు టీడీపీ కార్యాలయంలో సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్ సారథ్యంలో గురువారం నిర్వహించే జయహో బీసీ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య పిలుపునిచ్చారు. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారం తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి బీసీలందురూ తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

కౌన్సిలర్ చొరవతో చెత్త తొలగింపు

సూళ్లూరుపేట, జనవరి 9: మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉండడంతో పట్టణంలో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయింది. దీనికి తోడు రెండు రోజులుగా తేలికపాటి జల్లులు కురవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున 6వ వార్డు కౌన్సిలర్ ముత్తుకూరు లక్ష్మమ్మ స్పందించారు. సొంత నిధులతో వార్డు పరిధిలో ఉన్న కావలివీధి, నాగరాజపురం ప్రాంతంలో చెత్తను కూలీలను పెట్టి తొలగించారు. సమ్మెను దృష్టిలో పెట్టుకొని ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చెత్త బుట్టల్లో వేసుకోవాలని సూచించారు.

సైకోను తరిమికొడదాం: టీడీపీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కోట, జనవరి 9: సైకో సీఎం జగన్‌ను ఓటుతో తరిమికొట్టాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చిట్టేడులో మంగళవారం రాత్రి ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం జరిగింది. టీడీపీ నాయకులు ఇంటింటా తిరిగి మేనిఫెస్టో గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. జగన్ పాలనలో రాష్ట్రంలో ఒక్క అభివృద్ధి కూడా జరగలేదన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే బాబు సీఎం కావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించి ఎమ్మెల్యేగా డాక్టర్ పాశిం సునీల్‌కుమార్, సీఎంగా చంద్రబాబునాయుడును ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, పలగాటి భాస్కర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, జితేంద్రరెడ్డి, మధుయాదవ్, బాలకృష్ణయాదవ్, వేణు, మర్రి పోలయ్య, అనిల్, తూపిలి రాధాకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి



సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి

నాయుడుపేట టౌన్, జనవరి 9: సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ అని శ్రీవేమ విద్యాసంస్థల కరస్పాండెంట్ పెమ్మారెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. పట్టణంలోని విద్యకేంద్ర ఇంగ్లీషు మీడియం పాఠశాలలో మంగళవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు ముగ్గులు, భోగిమంటలను వేశారు. ప్రిన్సిపాల్ రామిరెడ్డి, ఉపాధ్యాయులు సురేష్‌రెడ్డి, జమీల, విజయ పాల్గొన్నారు.

శ్రీకృష్ణసేవాసమితికి పురస్కారం

గూడూరు, జనవరి 9: శ్రీకృష్ణసేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకుగాను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ పురస్కారం అందజేసినట్లు సేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ మంగళవారం తెలిపారు. తమ సేవాసమితి ద్వారా 15 ఏళ్లుగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, వీటిని గుర్తించిన తెలుగుబుక్‌ఆఫ్ రికార్డ్స్ ఫౌండర్ డాక్టర్ వెంకటాచారి అవార్డు అందజేశారన్నారు.



తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్స్ అందజేసిన సర్టిఫికెట్లుతో మయూరి శ్యామ్‌యాదవ్